RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 64 | శుక్రవారం, ఏప్రిల్ 5, 2024 | పేజీలు : 4


## హైదరాబాద్ లో భారీగా నకిలీ నోట్లు పట్టివేత

హైదరాబాద్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ లో భారీగా నకిలీ నోట్లు పట్టుబడడం కలకలం రేపింది. బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రూ.25 లక్షల నకిలీ కరెన్సీని మహేశ్వరం ఎస్వోటీ పోలీసులు పట్టుకున్నారు.

మహారాష్ట్ర నుంచి హైదరాబాద్ వచ్చిన నలుగురు కారులో నకిలీ కరెన్సీని తరలించేందుకు ప్రయత్నించి అడ్డంగా దొరికిపోయారు. బాలాపూర్ పోలీస్ స్టేషన్ ఎర్రకుంట వద్ద అనుమానాస్పదంగా కనిపించిన కారును ఆపి తనిఖీ చేయగా నకిలీ కరెన్సీ గుర్తించారు.

## కవిత బెయిల్ పిటిషన్‌పై...

# తీర్పు వాయిదా




న్యూఢిల్లీ: బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్ పై తీర్పు వాయిదా పడింది. ఢిల్లీ రౌస్ ఎవెన్యూ కోర్టులో గురువారం కవిత బెయిల్ పిటిషన్ పై విచారణ జరిగింది. తన కొడుకు పరీక్షలు ఉన్నందుకు బెయిల్ ఇవ్వాలని కవిత తరుపు లాయర్ కోర్టును కోరారు. ఏప్రిల్ 16వ వరకు కవితకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. అయితే.. కవితకు బెయిల్ ఇవ్వొద్దని.. ఆమెకు వ్యతిరేకంగా ఆధారాలు ఉన్నాయని ఈడీ కోర్టుకు తెలిపింది. లిక్కర్ పాలసీ ప్లాన్ చేసిందే కవిత అని.. దర్యాప్తు కీలక దశలో ఉందని.. ఇప్పుడు బెయిల్ ఇస్తే దర్యాప్తు ఆటంకం కలుగుతుందని ఈడీ తెలిపింది. అరుణ్ పిళ్లై, కవిత బినామిగా ఉన్నాడని.. వీరికి ఇండో స్పిరిట్ 33 శాతం వాటా ఉంది. తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని చెప్పిన ఈడి తరుపు న్యాయవాది.. వాటిని కోర్టుకు సమర్పించారు. ఇరువర్గాల వాదనలు విన్న రౌస్ ఎవెన్యూ కోర్టు బెయిల్ పిటిషన్ పై తీర్పును వాయిదా వేసింది.

# కేజ్రీవాల్‌కు ఊరట...



న్యూఢిల్లీ: జైలులో ఉన్న కేజ్రీవాల్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన పిటిషన్‌ను విచారణకు స్వీకరించడానికి ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. హిందూ సేన అధ్యక్షుడు విష్ణుగుప్తా దాఖలు చేసిన పిల్‌ను జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ సింగ్ అరోడాతో కూడిన బెంచ్ కొట్టేసింది. ముఖ్యమంత్రి పదవిలో కొనసాగాలా వద్దా అనే అంశం కేజ్రీవాల్ వ్యక్తిగత నిర్ణయంపై ఆధారపడి ఉంటుందన్నారు. ఈ అంశంలో న్యాయస్థానం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని బెంచ్ తెలిపింది. దీనిపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ లేదా రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని బెంచ్ తెలిపింది. " ప్రభుత్వం పనిచేయట్లేదని మేం ఎలా తేలిస్తాం. ఎల్‌జీ ఇందుకు సరైన వ్యక్తి. ఆయనకు మా మార్గదర్శకత్వం అవసరం లేదు. ఆయనకు సలహాలు ఇచ్చే అవకాశం మాకు లేదు. చట్ట ప్రకారం ఏం చేయాలో ఆయన ఆలోచిస్తారు." అని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. పిటిషనర్‌కు రాష్ట్రపతి, ఎల్‌జీ వద్ద పరిష్కారం దొరుకుతుందని సూచించారు. కేజ్రీవాల్‌ను పదవి నుంచి తప్పించాలని కోరుతూ పిల్ దాఖలు కావడం ఇది రెండోసారి. సూరజ్ సింగ్ యాదవ్ అనే వ్యక్తి గత నెల 28న దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా న్యాయస్థానం కొట్టేసింది.

# 370 సీట్ల టార్గెట్ సాధించాలి!



న్యూఢిల్లీ: తమతమ నియోజకవర్గాల్లో 'గత రికార్డులను కూడా ఛేదించండి' అంటూ ప్రధాని నరేంద్ర మోడీ, బిజెపి కార్యకర్తలను కోరారు. ' బిజెపి పార్టీకి 370 సీట్లు, బిజెపి నేతృత్వంలోని ఎన్డిఏ కూటమికి 400కు పైగా సీట్లను సాధించిపెట్టండి' అని కూడా ఆయన అన్నారు. ప్రజలు 'మరోసారి మోడీ ప్రభుత్వం' అంటున్నారని కూడా ఆయన తెలిపారు. ఉత్తరప్రదేశ్ లోని 10 లోక్ సభ నియోజక వర్గాల్లోని బిజెపి బూత్ కన్వీనర్లతో 'నమో యాప్' ద్వారా ప్రధాని మోడీ మాటామంతీ చేశారు. అట్టడుగు స్థాయిలో కూడా ప్రచారం ముఖ్యమని సూచించారు. అంతేకాక యోగి ఆదిత్యనాథ్ రాష్ట్రంలో అమలు చేస్తున్న 'మహిళా సురక్ష' పథకాన్ని కూడ ప్రధాని మోడీ ప్రశంసించారు. అసాధ్యాలను సుసాధ్యం ఎలా చేశామో.. అంటూ మోడీ వివరాలను వెల్లడించారు. ముఖ్యంగా రామ మందిర నిర్మాణం, ఆర్టికల్ 370 తొలగింపు, ఉచితంగా కొవిడ్ వ్యాక్సిన్ అందించడం, ట్రిపుల్ తలాక్ వ్యతిరేకంగా చట్టం తీసుకు రావడం తదితరాలను ఆయన ప్రస్తావించారు. ట్రిపుల్ తలాక్ విషయం గురించి చెబుతూ తమ కూతుళ్ల, సోదరీమణులను కాపాడినందుకు కేవలం ముస్లిం మహిళలే కాదు, ముస్లిం కుటుంబాలకు చెందిన పురుషులు కూడా ధన్యవాదలు తెలిపారన్నారు.

## అమేథీ నుంచి రాబర్ట్ వాద్రా పోటీ?

న్యూఢిల్లీ: కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ భర్త రాబర్ట్ వాద్రా రాజకీయ అరంగేట్రం చేయనున్నారా? గురువారం ఒక వార్తా సంస్థతో మాట్లాడుతూ నర్మగర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఈ అభిప్రాయానికి ఊతమిస్తున్నాయి. ఉత్తర్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న అమేథీ నియోజకవర్గం నుంచి లోక్‌సభ ఎన్నికలలో తాను పోటీ చేయనున్నట్లు ఆయన సూచనప్రాయంగా వెల్లడించారు. తాను పోటీ చేయాలని నిర్ణయించుకుంటే తమకే ప్రాతినిధ్యం వహించాలని అమేథీ ప్రజలు కోరుకుంటున్నారని ఆయన ప్రకటించారు. ప్రస్తుతం అమేథీకి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి స్మృతి ఇరానీపై ఆయన విమర్శలు గుప్పించారు. గత ఎన్నికల్లో అమేథీ నుంచి గెలిచిన వ్యక్తి గాంధీ కుటుంబంపై దాడి చేయడానికే పరిమితమై పోయారని, ప్రజల బాగోగులు, నియోజవకర్గ అభివృద్ధి గురించి ఆమెకు ఏమీ పట్టదని వాద్రా వ్యాఖ్యానించారు. అనేక ఏళ్లుగా రాయబరేలి(సోనియా గాంధీ ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం), అమేథీ, సుల్తాన్‌పూర్ నియోజకవర్గాల అభివృద్ధి కోసం గాంధీ కుటుంబం పాటుపడిందని ఆయన చెప్పారు. ప్రస్తుత ఎంపితో అమేథీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆమెను ఎన్నుకుని పెద్ద తప్పు చేశామని ప్రజలు భావిస్తున్నారని ఆయన అన్నారు. తాము తప్పు చేశామని అమేథీ ప్రజలు భావించిన మరుక్షణం వారు గాంధీ కుటుంబాన్ని తిరిగి కోరుకుంటున్నారని అర్థమని ఆయన చెప్పారు. అమేథీ ప్రజలు తనను కోరుకుంటే కాంగ్రెస్‌కు గొప్ప విజయాన్ని అందచేసినట్లేనని ఆయన వ్యాఖ్యానించారు. అమేథీ పార్లమెంటరీ నియోజకవర్గానికి మే 20న ఐదవ దశలో పోలింగ్ జరగనున్నది. జూన్ 4న ఫలితాలు వెలువడతాయి.

# సిఎం జగన్ ప్రచారం... జోరు!

తిరుపతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ ఎన్నికల ప్రచారం జోరు ఊపందుకుంది. రాబోయే సాధారణ ఎన్నికలు 'నీతిమంతమైన పాలన, మోసపూరిత శక్తులకు మధ్య జరిగే పోరు'గా ఆయన అభివర్ణించారు. ఇది నారా చంద్రబాబుతో జరిగే వ్యక్తిగత పోరు మాత్రం కాదన్నారు. పూతలపట్టులో ఆయన ప్రచారాన్ని కొనసాగించారు. చంద్రబాబు నాయుడు టిడిపి, బిజెపి నేతృత్వంలోని ఎన్డిఏ, పవన్ కళ్యాణ్ జనసేన కూటమిగా ఏర్పడ్డాయన్నారు.



'2014లో యుపిఏ కూటమి కూడా ఎన్నికల ప్రచారంలో నేరవేర్చ సాధ్యం కానీ వాగ్దానాలు చేసింది, వారు ఒక్క వాగ్దానాన్ని కూడా నెరవేర్చలేదు, ఇప్పుడు ఈ మూడు పార్టీలు ఒక్కటిగా చేరి ప్రజలను మోసం చేయచూస్తున్నాయి' అని విమర్శించారు. చంద్రబాబు నాయుడుకు చెందిన టిడిపిని ప్రజలు ఓడించి తగిన బుద్ధి చెప్పాలని జగన్ కోరారు.

# ట్యాపింగ్‌తోనే ఫామ్‌హౌస్ రీల్స్

హైదరాబాద్ : మునుగోడు ఉపఎన్నికల వేళ.. హైదరాబాద్‌లో నలుగురు బిఆర్ఎస్ ఎంఎల్ఎల కొనుగోలు వ్యవహారం లో సంచలన విషయాలు వెలుగు చూశాయి. ఈ కేసుకు మూలం ఫోన్ ట్యాపింగేనని పోలీసు కస్టడీలో ఉన్న మాజీ డిసిపి రాధాకిషన్‌రావు చెప్పినట్లుగా తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న ఎస్ఐబి మాజీ డిఎస్పి ప్రణీత్ రావు నలుగురు బిఆర్ఎస్ ఎంఎల్ఎలు గువ్వల బాలరాజు, రోహిత్ రెడ్డి, రేగా కాంతారావు, బీరం హర్షవర్ధన్ రెడ్డిల ఫోన్లు ట్యాప్ చేశారు. వారు బిజెపితో సంప్రదింపులు జరుపుతున్నట్లుగా తెలియగానే ప్రణీత్ రావు ప్రభుత్వ పెద్దలకు తెలియచేసినట్లుగా తెలుస్తోంది. ఆ తర్వాత రాధాకిషన్‌రావుతో కలిసి స్పెషల్ ఆపరేషన్ కు ప్లాన్ చేశారని భావిస్తున్నారు. నందకుమార్‌తో పాటు స్వామిజీని అప్పటి తాండూరు ఎంఎల్ఏ పైలట్ రోహిత్‌రెడ్డి ఫామ్‌హౌస్‌కు పిలిపించారు. అంతకు ముందే ఎంఎల్ఎలతో బిఆర్ఎస్ హైకమాండ్ ఈ అంశంపై మాట్లాడింది. బేరాల గురించి మొత్తం తెలిసిపోయిందని, రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు సహకరించాలని సూచించినట్లుగా తెలుస్తోంది. సిట్టింగ్ ఎంఎల్ఎలకే టిక్కెట్లు ఆఫర్ చేయడంతో వారు అంగీకరించిటన్లుగా తెలుస్తోంది. రోహిత్‌రెడ్డికి తెలిసే ఆయన ఫామ్‌హౌస్‌లో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ట్రాప్ కెమెరాలను రాధాకిషన్ రావు





అండ్ కో ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. చివరికి అనుకున్నట్లుగా ట్రాప్ చేశారు. పట్టుకున్నారు. ఈ కేసు సంచలనం అయింది. ఈ కేసులో ఎంఎల్ఎలతో బేరాలాడి పట్టుబడిన ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. కేరళకు చెందిన తుషార్‌తో పాటు బిజెపి ముఖ్య నేత బి ఎల్ సంతోష్ పేరు కూడా తెరపైకి వచ్చింది. దీంతో వీరిద్దరిని అరెస్టు చేసేందుకు తెలంగాణ పోలీసులు ప్రయత్నించారు. ఈ కేసు విచారణకు గత ప్రభుత్వం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేసు బయటపడిన తర్వాత చాలా రోజుల పాటు ఆ నలుగురు ఎంఎల్ఎలు ఫామ్‌హౌస్ లోనే నెల రోజుల పాటు ఉన్నారు.

## నన్ను ఓడించేందుకు....

# అవినీతిపరులంతా ఏకమయ్యారు



**- పిఎం మోడీ**

న్యూఢిల్లీ: పాకిస్తాన్ నుంచి సీమాంతర ఉగ్రవాదాన్ని సమర్థంగా ఎదుర్కోవడంలో గత కాంగ్రెస్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని ప్రధాని నరేంద్ర మోడీ ఆరోపించారు. భారత్ దుర్బలమైన. పేద దేశమన్న భావన ఏర్పడేందుకు ఇది కారణమైందని ఆయన అన్నారు. గురువారం నాడిక్కడ ఒక ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రసంగిస్తూ ప్రతిపక్ష ఇండియా కూటమిని ఎద్దేవా చేశారు. అవినీతి కేసులలో జైలు శిక్షలు పడాలంటూ పరస్పరం తిట్టిపోసుకున్న పార్టీలన్నీ మోడీపై పోరాటం పేరుతో ఏకమయ్యాయని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, ఆర్‌జెడి (ఇండియా కూటమిలో భాగస్వామ్య పక్షం) దేశానికి ఎంత చెడ్డ పేరు తీసుకువచ్చాయంటే మనం చాలా బలహీనమైన, పేద దేశమని ప్రపంచ దేశాలు ఆలోచించడం మొదలు పెట్టాయని మోడీ అన్నారు. గోధుమలు వంటి తమ ఆహార సరఫరాల కోసం అల్లాడిపోయే చిన్న దేశాల నుంచి ఉగ్రవాదులు ఇష్టారీతిన భారత్‌పై దాడి చేసేవారని ఆయన చెప్పారు. శక్తివంతమైన దేశాల జోక్యాన్ని అర్థించడం మినహా కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈ విషయంలో చేసిందేమీ లేదని ఆయన ఆరోపించారు. మనది చాలా ప్రాచీన దేశమని, మగధ వంటి శక్తివంతమైన రాజ్యాలు, చంద్రగుప్త మౌర్య వంటి గొప్ప రాజులు పాలించిన దేశమని ఆయన అన్నారు. శత్రుకు వారి సొంత గడ్డపైనే గట్టిగా బుద్ధి చెబుతున్న కొత్త భారత్‌ను ప్రపంచం ఆశ్చర్యంగా చూస్తోందని ఆయన చెప్పారు. విదేశీ విధానంలో భారత్ వైఖరిలో వచ్చిన మార్పును చూసి ప్రపంచ దేశాలు సైతం సంభ్రమాశ్చర్యాలకు లోనవుతున్నాయని ఆయన అన్నారు. స్వీయ రక్షణను సాధించుకున్నామని, ముఖ్యమైన వ్యవహారాలలో మన సలహాను ప్రపంచ దేశాలు కోరుతున్నాయని, ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగామని, విజయవంతంగా చంద్రయాన్ ప్రయోగించామని, జి20 సదస్సును విజయవంతంగా నిర్వహించామన్న ప్రశంసలు పొందామని ప్రధాని మోడీ తెలిపారు.

## రాజ్యసభ సభ్యురాలిగా ప్రమాణం చేసిన సోనియా గాంధీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత సోనియా గాంధీ రాజ్యసభ సభ్యురాలిగా ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం సోనియా చేత రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్కర్ ప్రమాణ స్వీకారం చేయించారు. రాజస్థాన్ నుంచి రాజ్యసభ సభ్యురాలిగా సోనియా గాంధీ ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. ఇప్పటిదాకా ఆమె, ఉత్తర్ ప్రదేశ్ లోని బరేలీ నియోజకవర్గం నుంచి ఎంపిగా ఉన్నారు. ఈ సారి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయెద్దని ఆమె నిర్ణయించుకున్నారు.

అందుకే పెద్దల సభకు పోటీ చేశారు. ఇప్పటివరకు లోక్ సభకు ప్రాతినిధ్యం వహించిన సోనియా గాంధీ.. తొలిసారిగా రాజ్యసభలో అడుగుపెట్టారు.

## తెలంగాణకు...

# 'టెస్లా'ను తీసుకురాడానికి ప్రయత్నిస్తున్నాము

హైదరాబాద్: ఎలక్ట్రిక్ వెహికిల్ దిగ్గజం 'టెస్లా'ను తెలంగాణకు తీసుకురాడానికి ప్రభుత్వం అన్ని విధాల ప్రయత్నిస్తోందని తెలంగాణ ఐటి, పారిశ్రామిక మంత్రి డి. శ్రీధర్ బాబు గురువారం తెలిపారు. 2023 డిసెంబర్ నుంచే తెలంగాణ ప్రభుత్వం టెస్లా తెలంగాణలో పెట్టుబడి పెట్టేలా ప్రయత్నిస్తోందన్నారు. టెస్లా కంపెనీతో సంప్రదింపులు కొనసాగిస్తున్నామన్నారు. శ్రీధర్ బాబు తన ట్వీట్ ను టెస్లా చీఫ్ ఎలాన్ మస్క్ కు కూడా ట్యాగ్ చేశారు.



టెస్లా కంపెనీ దేశంలో రెండు లేక మూడు బిలియన్ డాలర్లతో ఎలక్ట్రిక్ కార్ ప్లాంట్ ను నెలకొల్పేందుకు చూస్తోందని, తెలంగాణ ప్రభుత్వం ఈ అవకాశాన్ని చేజిక్కించుకునేందుకు అన్ని విధాల ప్రయత్నించాలని మాజీ ఐటి, పరిశ్రమల మంత్రి కె.టి.రామారావు తెలంగాణ ప్రభుత్వాన్ని కోరిన కొన్ని గంటలకే మంత్రి ఎక్స్ పోస్ట్ తెరపైకి వచ్చింది.

## సంపాదకీయం

# ఎన్నికల అస్త్రంగా కచ్చ తీవు

సార్వత్రిక ఎన్నికల సమయంలో బీజేపీ మరో సున్నిత అంశాన్ని తెరపైకి తెచ్చింది. ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు 'కచ్చతీవు దీవి'ని శ్రీలంకకు అప్పగించినట్లు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా బహిర్గతమైంది. ఇదే అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్‌లో స్పందించారు. 'ఆశ్చర్యం వేసింది.. కచ్చతీవు దీవిని కాంగ్రెస్ నిర్మొహమాటంగా శ్రీలంకకు అప్పగించిందనే నిజం వెలుగులోకి వచ్చింది.. కాంగ్రెస్‌ను విశ్వసించలేం.. ప్రతి భారతీయుడికి ఈ ఘటన ఆగ్రహం తెప్పిస్తుంది.. ఎప్పటికీ ఈ దారుణం మన మనసులో నుంచి వెళ్లదు.. దేశ ఐక్యతను, సమగ్రతను, ప్రయోజనాలను 75 ఏళ్లుగా కాంగ్రెస్ దూరం చేస్తూనే ఉంది' అని ప్రధాని విమర్శలు గుప్పించారు. యూపీలోని మీరట్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచారంలోనూ ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ఇంతకీ కచ్చతీవు వివాదం ఏంటి? ఈ దీవిని శ్రీలంకకు ఎందుకు అప్పగించారు? అనే చర్చ జరుగుతోంది. భారత్-శ్రీలంకలను వేరుచేసే పాక్ జల సంధిలో రామేశ్వరం దీవికి సమీపంలో కచ్చతీవు ఉంది. భారత్ తీరానికి 20 కిలోమీటర్ల దూరంలోని 1.9 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండే ఈ దీవి విషయంలో 1974లో అప్పటి భారత ప్రధాని ఇందిరా గాంధీ, శ్రీలంక ప్రధాని సిరిమావో బండారు నాయకేల మధ్య ఓ ఒప్పందం కుదిరింది. అందులో భాగంగానే శ్రీలంకకు కచ్చతీవును అప్పగించారు. అయితే, ఆ దీవిలో ఎవరూ నివాసం ఉండరు, కేవలం మత్స్య సంపదే ఉంటుంది. భారత మత్స్యకారులు అక్కడే ఎక్కువగా వేట సాగిస్తుంటారు.కానీ, ఇటీవల కాలంలో శ్రీలంక సైన్యం భారత జాలర్లపై దాడులు చేయడం, వారిని నిర్బంధించడం వంటివి చేస్తుంది. ఒప్పందం ప్రకారం భారత మత్స్యకారులకు ప్రవేశం ఉన్నప్పటికీ శ్రీలంక తిలోదకాలు ఇచ్చింది. అలాగే, కచ్చతీవులో ఉండే సెయింట్ ఆంటోనీ చర్చిలో ఏటా జరిగే జాతరలో తమిళనాడు నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటారు.తమిళనాడు రామేశ్వరం దీవికి సమీపంలో భారత్- శ్రీలంకను వేరుచేస్తున్న పాక్ జలసంధిలో ఉంది. ఈ జలసంధి రెండుదేశాలకు సరిహద్దుగా ఉంటోంది. పాక్ బే, బంగాళాఖాతంతో ఈ జలసంధి కలుపుతోంది. 1974లో అప్పటి భారత ప్రధాని ఇందిరాగాంధీ, శ్రీలంక ప్రధాని సిరిమావో బండారునాయకేల మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా శ్రీలంకకు అప్పగించారు. ఇది చాలా చిన్నదీవి. ఎవరూ ఉండరు. అయితే దీనిపరిధిలో మత్స్య సంపద ఎక్కువగా ఉంటుంది. దీంతో భారత మత్స్యకారులు ఇక్కడ వేట ఎక్కువగా సాగిస్తుంటారు. శ్రీలంక తమది అన్న నెపంతో వీరిపై దాడులు చేయడంతో పాటు అరెస్టులు చేస్తోంది. ఈ దీవిలో భారత్ మత్స్యకారులకు ప్రవేశం ఉందని ఒప్పందం స్పష్టం చేస్తున్నా.. శ్రీలంక ఖాతరు చేయడం లేదు. ఇక్కడ సెయింట్ ఆంటోనీ అనే ప్రార్థనామందిరం ఉంది. ఏటా జరిగే ఉత్సవాల్లో తమిళనాడు వాసులు ఎక్కువగా పాల్గొంటారు.భారత రాజ్యాంగ ప్రకారం మన భూభాగాన్ని ఇతర దేశాలకు ఇవ్వాలంటే కచ్చితంగా రాజ్యాంగ సవరణ తప్పనిసరి. 1958లో భారత్-తూర్పు పాకిస్థాన్‌ల మధ్య బెరుబరి ప్రాంతం వివాదంగా ఉండేది. భారత ప్రధాని నెహ్రూ, తూర్పు పాకిస్థాన్ గవర్నర్ ఫిరోజ్‌ఖాన్ నూన్‌ల మధ్య ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం బెరుబరిలోని కొంత ప్రాంతాన్ని తూర్పు పాకిస్థాన్ (ప్రస్తుతం బంగ్లాదేశ్) ఇచ్చారు. అయితే దీనిపై వివాదం చెలరేగడంతో అంశం సుప్రీం కోర్టుకు చేరింది. మన దేశానికి చెందిన ప్రాంతాలను ఇతర దేశాలకు ఇవ్వడం చెల్లదని పేర్కొంది. దీంతో 1960లో రాజ్యాంగ సవరణ చేసి కొంతప్రాంతాన్ని తూర్పు పాక్‌కు ఇచ్చారు. కచ్చతీవు స్వాతంత్ర్యం రాకపూర్వం రామ్‌నాడ్ పాలకుల ఆధీనంలో ఉండేది. ప్రస్తుతం రామేశ్వరం సహా పలుదీవులపై రామ్‌నాడ్ జమీందారుల పాలన సాగేది. అనంతరం భారత్‌లో చేరడం, తమిళనాడు రాష్ట్రం ఏర్పాటు జరిగింది. న్యాయపరంగా చూస్తే ఈ అప్పగింత చెల్లదని తమిళనాడు పక్షాలు వాదిస్తున్నాయి. రాజ్యాంగ సవరణ చేయకుండా ఎలా అప్పగిస్తారని ప్రశ్నిస్తున్నాయి.రామేశ్వరం సహా పలుదీవులు మొదట్లో రామ్‌నాథ్ పాలకుల ఆధీనంలో ఉండేది. తర్వాత అది భారత్‌లో విలీనం కావడం, మద్రాసు రాష్ట్రం ఏర్పడటం జరిగింది. ఇక న్యాయపరంగా చూస్తే దీవిని అప్పగించడం చెల్లదని తమిళనాడు పక్షాలు వాదిస్తున్నాయి. రాజ్యాంగ ప్రకారం మన భూభాగాన్ని ఇతర దేశాలకు అప్పగించాలంటే రాజ్యాంగ సవరణ తప్పనిసరి. రాజ్యాంగ సవరణ చేయకుండా ఎలా శ్రీలంకకు దీవిని ఇచ్చేస్తారని ప్రశ్నిస్తున్నారు.తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ఆర్టీఐ ద్వారా కచ్చతీవులపై అడిగిన ప్రశ్నకు విదేశాంగ శాఖ సమాధానం ఇస్తూ.. 'స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే శ్రీలంక.. తమ అనుమతి లేకుండా భారత నావికాదళం (అప్పటి రాయల్ ఇండియన్ నేవీ) కచ్చతీవులో విన్యాసాలు నిర్వహించకూడదని ప్రకటించింది... అక్టోబర్ 1955లో సిలోన్ ఎయిర్ ఫోర్స్ అక్కడ విన్యాసాలు నిర్వహించింది. మే 10, 1961లో నాటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఈ సమస్యను అసంబద్ధం అని కొట్టిపారేశారు.

# మెడిసిటీ హాస్పిటల్ మేడ్చల్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

**– పేదల కొరకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయం**

**– సీనియర్ నాయకులు అలియాబాద్ గ్రామ మాజీ సర్పంచ్ కమటం కృష్ణారెడ్డి**





**శామీర్ పేట (గరుడ వార్త) :** మెడిసిటీ లాంటి కార్పొరేట్ ఆసుపత్రి సౌజన్యంతో పేదల కొరకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని సీనియర్ నాయకులు అలియాబాద్ గ్రామం మాజీ సర్పంచ్ కమటం కృష్ణారెడ్డి అన్నారు. గురువారం షామీర్పేట మండలం అలియాబాద్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి సీనియర్ నాయకులు అలియాబాద్ గ్రామం మాజీ సర్పంచ్ కమటం కృష్ణారెడ్డిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మేలు జరిగే ప్రతి పనిలో తన ముందుంటానని అన్నారు. ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటుచేసి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు మరియు కంటి పరీక్షలతో పాటు,చెవి,ముక్కు,గొంతు,వరిబీజము, బీజకుట్టు,గడ్డలు,కనతులు, థైరాయిడ్ గడ్డలు,గర్భ సంచికి సంబంధించిన సమస్యలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మ సమస్యలు, మోకాళ్ళ నొప్పులు, నడుము నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలు చూసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఇట్టి కార్యక్రమములో గ్రామస్తులు,ప్రజలు పాల్గొన్నారు. . ఈ వైద్య శిబిరంలో 128మందికి షుగర్, బీపీ, టెస్టులు ,ఆపరేషన్ అవసరము ఉన్న వాళ్ళ 54 మందిని ఆసుపత్రికి రిఫర్ చేయడం జరిగిందని రిఫర్ చేసిన వారిని మెడిసిటీ హాస్పిటల్ కు తరలించి ఉచిత ఆపరేషన్లు చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్య శిభిర కార్యక్రమంలో డాక్టర్లు ప్రవీణ్, వంశీ, కార్తీక్, కీర్తి మార్కెటింగ్ ఇంచార్జి కుమారస్వామి, నాగార్జున, సత్యనారాయణ, ప్రమీల, లు పాల్గొనడం జరిగింది.

# వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన సునీతా మహేందర్ రెడ్డి



**శామీర్ పేట, (గరుడ వార్త) :** మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి పలు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. గురువారం శామీర్ పేట మండలం తూముకుంట మున్సిపల్ పరిధిలోని జాన్వి కన్వెన్షన్, ఎస్.ఎన్.ఆర్ వేద లలో జరిగిన వివాహ వేడుకలకు సునీత మహేందర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్, తూముకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి బాలేష్, నాయకులు వంగ లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్న జిల్లా యంత్రాంగం





**జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజిగిరి (గరుడ వార్త) :** హైదరాబాదు ఉప్పల్ స్టేడియం జరగబోవు ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా వీక్షించడానికి వచ్చే ప్రేక్షకులకు, ఓటర్లకు సైతం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యంత్రాంగం అవగాహన కల్పిస్తుంది. అందులో భాగంగా గురువారం ఉప్పల్ స్టేడియం పరిసర ప్రాంతాలలో ఓటరు అవగాహన చైతన్య కార్యక్రమాలు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సంబంధిత అధికారులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా విచ్చేయుచున్న సందర్శకులకు ఓటు పై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు ఓటు వేయాలి , నా ఓటు నా దేశం కోసం. ఎన్నికల పర్వం-దేశానికి గర్వం. మరియు ప్రతి ఒక్కరూ ఓటును ఆయుధంగా మలుచుకుని అధిక సంఖ్యలో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవాలని, అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి సాంబశివరావు డిపిఆర్ఓ, అరుంధతి డిపిఎం, యాదయ్య sveep సిబ్బంది వెంకట్, sravan తదితరులు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యారు.

# రంజాన్ మాసం పురస్కరించుకొని మజీద్ పూర్ లో ఇఫ్తార్ విందు



**శామీర్ పేట, (గరుడ వార్త) :** రంజాన్ మాసం పురస్కరించుకొని ఇఫ్తార్ విందులు కులమతాలకు అతీతమణి తుంకి రమేష్ అన్నారు. శామీర్ పేట మండలం మజీద్ పూర్ గ్రామంలో రంజాన్ మాసం సందర్భంగా ముస్లీం సోదరులకు తుంకి రమేష్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మసీదులో ప్రత్యేక ప్రార్థనలలో ముస్లీం సోదరులు పాల్గొని అనంతరం ఇఫ్తార్ విందులో రంజాన్ ఒక్కపొద్దున విడిచారు. ఈ కార్యక్రమంలో షేక్ ఇమ్మమ్ సాబ్, మహమ్మద్ అహ్మద్ ఖాన్, షేక్ సల్మాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# "అగ్నిప్రైమ్ " కొత్తతరం బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం విజయవంతం



ఒడిశా తీరం లోని ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి బుధవారం సాయంత్రం 7 గంటల సమయంలో అగ్నిప్రైమ్ అనే కొత్తతరం బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా ప్రయోగించినట్టు కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ గురువారం ప్రకటించింది. వివిధ ప్రదేశాల్లో మోహరించిన అనేక శ్రేణి సెన్సార్ల డేటా ఆధారంగా ఈ క్షిపణి దానికి నిర్దేశించిన అన్ని లక్ష్యాలను పూర్తి చేసిందని రక్షణశాఖ పేర్కొంది. ఈ ప్రయోగాన్ని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, చీఫ్ ఆఫ్ స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్, డిఆర్‌డిఒ, ఇండియన్ ఆర్మీ అధికారులు పర్యవేక్షించారు. ఈ అగ్నిప్రైమ్ పరీక్ష విజయవంతం కావడంతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ డిఆర్‌డిఒ, ఎస్ఎఫ్‌సి, సాయుధ దళాలను అభినందించారు. ఇది సాయుధ దళాలకు అద్భుతమైన బలాన్ని అందించగలదని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. చైనా, పాకిస్థాన్ వంటి దేశాలకు వ్యతిరేకంగా భారత్‌కు బలమైన శక్తిని ఇది అందిస్తుందని భావిస్తున్నారు. ఇది కొత్తతరం అణుసామర్థ్యం గల మధ్యస్థ శ్రేణి బాలిస్టిక్ క్షిపణి. అగ్ని సిరీస్‌లో భాగంగా డిఫెన్స్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ అభివృద్ధి చేసిన ఈ ఆరో క్షిపణి 1000 నుంచి 2000 కిమీ శ్రేణి సామర్థ్యం కలిగినదిగా రక్షణ మంత్రిత్వశాఖ పేర్కొంది. రక్షణ శాఖ ప్రారంభించిన ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగమైన ఈ క్షిపణి అగ్ని4, అగ్ని 5 ల సాంకేతిక పురోగతిని కూడా కలిగి ఉందని వివరించింది.

# ఎస్‌బి ఆర్గానిక్ ప్రమాద ఘటనలో క్షతగాత్రులను పరామర్శించిన హరీశ్ రావు



హైదరాబాద్: ఎస్‌బి ఆర్గానిక్ ప్రమాద ఘటనలో క్షతగాత్రులను బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ హరీశ్ రావు పరామర్శించారు. ఎంఎన్‌ఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్షతగాత్రులను రూ.25 లక్షల పరిహారం ప్రకటించాలని కోరారు. మృతుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాద ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని, యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, మంత్రుల పరామర్శలు, కంటితుడుపు చర్యలు పనికిరావని చెప్పారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని చందాపూర్ గ్రామ శివారులో ఎస్ బి ఆర్గానిక్ రసాయన పరిశ్రమలో బుధవారం బాయిలర్ ఆయిల్ రియాక్టర్ పేలి సంస్థ డైరెక్టర్‌తో సహా ఆరుగురు మృతి చెందిన విషయం తెలిసిందే.

## కాంగ్రెస్ లో కరీంనగర్ పంచాయితీ

**కరీంనగర్:** టాపాసులు రెడీ అయ్యాయి.. అంటుపెట్టడానికి కాంగ్రెస్ కార్యకర్తలంతా అగ్గిపెట్టెలతో రెడీగా ఉన్నారు. కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఈ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, మంత్రి పొన్నం ప్రభాకర్ బలపరిచిన 'వెలిచాల రాజేందర్ రావు'కే టికెట్ ఖాయం అని అంతా అనుకున్నారు. ప్రకటన ఆలస్యం ధూంధాం చేయడానికి కాచుకుకూర్చున్నారు. కానీ అందరూ ఆమోదించిన వెలిచాలను కాదని.. హుస్నాబాద్ లో ఓసారి ఓడిపోయిన.. ఆ నియోజకవర్గానికి మాత్రమే పరిమితమైన రెడ్డి సామాజికవర్గ నేత 'అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి' పేరు సడెన్ గా కరీంనగర్ ఎంపీ అభ్యర్థిగా తెరపైకి రావడాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు జీర్ణించుకోవడం లేదు. అసలేమైంది? ఎందుకిలా అభ్యర్థిని మార్చుతున్నారన్న అయోమయంలో నేతలంతా హతాషులవుతున్న పరిస్థితి నెలకొంది. కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్ రావు పేరు ఖరారైందని.. ఇటీవల రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం, ఉత్తమ్, శ్రీధర్ బాబులు హైదరాబాద్ లో భేటిలో ఫైనల్ చేశారని సమాచారం అందింది. దీంతోపాటు వెలిచాలకు ఈ విషయం చేరవేయడంతో ఆయన లాంచింగ్ కు ఘనంగా ఏర్పాట్లు చేసుకున్నారు. కార్యకర్తలు, నేతలంతా సంబరంగా సంతోషపడుతున్నారు. అంతా హ్యాపీగా సాగుతున్న వేళ సడెన్ గా రెడ్డి సామాజికవర్గానికి చెందిన అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి పేరు తెరపైకి రావడంతో కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ నేతలంతా షాక్ అయిన పరిస్థితి నెలకొంది. కరీంనగర్ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్ పేరు దాదాపు ఖరారైందని.. గల్లీ నుంచి ఢిల్లీదాకా సంకేతాలు పంపించి.. ఆయన అభిమానులు సర్వం సిద్ధం చేసుకున్న ఈ సమయంలో చివరి నిమిషంలో ప్రవీణ్ రెడ్డి పేరు రావడంతో కార్యకర్తలు, నేతలంతా షాక్ అవుతున్న పరిస్థితి నెలకొంది. జిల్లా కీలక మంత్రి పొన్నం ప్రభాకర్, ముగ్గురు ఎమ్మెల్యేలు కవ్వంపల్లి, మేడిపల్లి సత్యం, మిగతా నియోజకవర్గ ఇన్ చార్జీలు ముక్తకంఠంతో రాజేందర్ రావు అభ్యర్థిత్వానికి మద్దతునిచ్చారు. ఆరు నియోజక వర్గాల ఇన్ చార్జీలు రాజేందర్ కి మద్దతుగా లేఖలు అధిష్టానానికి పంపించారు. మొదటి నుంచి కరీంనగర్ అంటే వెలిమల ఆధిపత్యమే నడుస్తోంది. ఇక్కడ అత్యధికంగా గెలిచింది వెలమ సామాజికవర్గ నేతలే.. ఇక్కడ గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న వెలిచాల రాజేందర్ రావుకే టికెట్ ఇవ్వాలని నేతలంతా ప్రతిపాదన చేశారు. దీనికి సానుకూలంగా అంతా ఓకే చెప్పి నిర్ణయం వెలువడుతున్న ఈ తరుణంలో ఇప్పుడు ఉన్నట్టుండి ప్రవీణ్ రెడ్డి పేరు తెరపైకి రావడం కాంగ్రెస్ వర్గాలను అయోమయానికి గురిచేస్తోంది. దీన్ని కాంగ్రెస్ శ్రేణులంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.. ఏం జరిగిందో తెలుసుకోవడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రాజేందర్ రావుకే టికెట్ ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పైన తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నారని సమాచారం. ఇక 3 ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్ చార్జీలు సపోర్టు చేసిన వ్యక్తిని కాదని ప్రవీణ్ రెడ్డిని అభ్యర్థిగా ఎంపిక చేయడంపై మంత్రి పొన్నం ప్రభాకర్ సహా నేతలంతా గుస్సా అయినట్టు ప్రచారం సాగుతోంది. ఈ మేరకు తమ నిరసనను అధిష్టాన వర్గానికి తెలియజేసినట్టు సమాచారం. అధిష్టానంతో తాడోపేడో తేల్చుకోవడానికి రెడీ అయినట్టుగా తెలుస్తోంది..వెలమల కోటలో అందరూ సపోర్టు చేసిన వెలిచాల రాజేందర్ రావును కాదని.. రెడ్డి సామాజికవర్గానికి చెందిన అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డికి ఎందుకు టికెట్ కేటాయిస్తున్నారు? ఒక నియోజకవర్గ నేతను పార్లమెంట్ బరిలో దింపడం బండి సంజయ్ ను గెలిపించడానికేనా? అన్న చర్చ కార్యకర్తలు, నేతలు, నియోజకవర్గంలో సాగుతోంది. వెలిచాలకే టికెట్ అని సీఎంవో నుంచి సైతం ఇన్ఫర్మేషన్ ఇచ్చి మరీ ఇప్పుడు అభ్యర్థిని మార్చింది ఎవరన్న ప్రశ్న కాంగ్రెస్ శ్రేణులను తొలుస్తోం.

## పాలమూరు ఎమ్మెల్యేలకు పదవీ గండం

**మహబూబ్ నగర్:** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుంచి బీఆర్ఎస్ పార్టీ తరుపున గెలిచింది ఇద్దరే ఎమ్మెల్యేలు. ఇప్పుడు వారికి కూడా పదవీ గండం వెంటాడుతోంది. ఎన్నికల అఫిడవిట్‌లో సమాచారం సరిగ్గా పేర్కొనలేదంటూ ప్రత్యర్థులు కోర్టుకు వెళ్లడంతో ఆ ఇద్దరికి కొత్త తలనొప్పులు మొదలయ్యాయట. అందులోనూ ఒక ఎమ్మెల్యేకు గతంలోనే న్యాయస్థానంలో ఎదురుదెబ్బ సైతం తగిలింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 14 స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీ గెలిచింది కేవలం రెండు స్థానాలు మాత్రమే. ఆ రెండు కూడా నడిగడ్డలోని అలంపూర్, గద్వాల్ అసెంబ్లీ నియోజకవర్గాలు. అలంపూర్ నుంచి విజయుడు, గద్వాల్ నుంచి బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. అయితే ఎన్నికలు ముగిసి ఇంకా నాలుగు నెలలు కూడా కాలేదు. అంతలోనే వారికి కష్టాలు మొదలయ్యాయట. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఎన్నికల అఫిడవిట్‌లో ఆస్తులు, అప్పుల సమాచారాన్ని సరిగా పేర్కొనలేదని ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి సరిత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో గద్వాల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన సందర్భంలో అఫిడవిట్ లో బ్లాంక్ పెట్టారని, అలాగే పలు పెనాల్టీల అంశాలు, ఆస్తులు, అప్పులు వివరాలు చూపలేదని ఆరోపించారు. దీంతో ఆయన ఎన్నికను రద్దు చేయాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు కాంగ్రెస్ నేత సరిత. ఇక, అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు జోగుళాంబ గద్వాల్ జిల్లాలోని ఉండవెల్లి మండలం పుల్లూరు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌గా ప్రస్తుత అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు విధులు నిర్వర్తించారు. అయితే ఎన్నికల్లో నామినేషన్ కంటే ముందే ఉద్యోగానికి రాజీనామా చేయలేదని ఆరోపణలు వెల్లువెత్తాయి. నాటి ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని హైకోర్టులో కేసు దాఖలు చేశారు బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న కుమార్. ఎమ్మెల్యేగా పోటీ చేయాలంటే తప్పనిసరిగా ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యాగానికి రాజీనామా చేసి ఉండాలన్న ఆరోపణలతో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ ఇద్దరు ఎమ్మెల్యేపై దాఖలైన కేసులను విచారించిన హైకోర్టు ఇరువురికి నోటీసులు జారీ చేసింది. ఏప్రిల్ 18వ తేదీ వరకు నోటీసులకు సమాధానం ఇవ్వాలని పేర్కొన్నట్లు సమాచారం. అయితే 2019 ఎన్నికల్లో అఫిడవిట్‌లో ఆస్తులు, అప్పులు సరిగా చూపించలేదన్న ఆరోపణలతో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి వ్యతిరేకంగా డీకే అరుణ పిటిషన్ దాఖలు చేశారు. విచారించిన హైకోర్టు ఎమ్మెల్యేను డిస్ క్వాలిఫై చేయడంతో పాటు రూ. 2.50లక్షల జరిమానా సైతం విధించింది. తిరిగి బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో అక్కడ స్టే లభించింది. అయితే ప్రస్తుతం ఏం జరుగుతుందోనని ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు ఆందోళనలో ఉన్నారట.

# అసలు సమస్య ఆశ్రిత గుజరాతీవాదం!



ఆధునిక భారతదేశ రాజకీయ పరిణామాలకు పునాది 1857. బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా భారత స్వాతంత్ర్య ప్రథమ పోరాటం సాగిన సంవత్సరమది. ఆ పోరాటం విజయవంతం కాకపోయినప్పటికీ, సామాజిక రంగంలో అదొక కొత్త సమీకరణల్ని ముందుకు తీసుకుని వచ్చింది. బ్రిటీష్ వలస వ్యతిరేక పోరాట కాలంలో హిందూ ముస్లీంల మధ్య ప్రగాఢ ఐక్యత ఏర్పడింది. ప్రాదేశిక జాతీయవాదం అనే భావన బలంగా ముందుకు వచ్చింది. భారతదేశ సరిహద్దుల లోపల నివసించేవారందరూ ఒకే జాతి అనేది దీని సారాంశం. దాని పేరు భారతజాతి / హిందూజాతి. హిందూ ముస్లిం సమూహాలు భారీ సంఖ్యలో ఢిల్లీ ఎర్రకోట ముందు నిలబడి, 80 యేళ్ళు దాటిన వృద్ధ చక్రవర్తి రెండవ బహదూర్ షా జాఫర్‌ను స్వాతంత్ర్య ఉద్యమంలో తమకు నాయకత్వం వహించమని ముక్తకంఠంతో కోరడం ఒక గొప్ప చారిత్రాత్మక ఘట్టం. ప్రజల కోరిక మేరకు జాఫర్ ఆ తిరుగుబాటుకు నాయకత్వం వహించాడు. అందుకు శిక్షగా రంగూన్‌లో హౌస్ అరెస్టులో ఉండి 1962లో చనిపోయాడు. ఆ తరువాత ఆరంభమైన జాతీయోద్యమం భారత స్వాతంత్ర్య ప్రథ పోరాటం నుంచి 'ప్రాదేశిక జాతీయవాదం'ను ఆదర్శంగా స్వీకరించింది. గతంలో ఎవరు ఎక్కడ నివాసం వున్నా ప్రస్తుతం భారతదేశంలో విలీనమై నివసిస్తున్నారు కనుక వీరందరూ భారతీయులే అనేది ప్రాదేశిక జాతీయవాదం అవగాహన. ఉర్దూ మహాకవి ముహమ్మద్? అల్లమా ఇక్బాల్ 1904లో 'సారే జహా సే అచ్ఛా హిందూసితా హమారా' (ప్రపంచంలో మహోన్నతమైనది మన హిందూదేశము) అనే పల్లవితో సుప్రసిద్ధ జాతీయ గీతాన్ని రాశారు. అందులోని ఒక చరణంలో 'మనం హిందువులం మనది హిందూదేశము' (హిందూ హై హమ్ – వతన్ హై హిందూస్తాన్ హమారా) అంటారు. ఇందులోని హిందూ, హిందూస్తాన్ వగయిరా పదాల్ని ప్రాదేశిక జాతీయవాద దృక్పథంతో రాశారు. ఇప్పుడు హిందూమతంగా ప్రచారంలో వున్నది అప్పట్లో సనాతనధర్మం పేరుతో వుండేది. హిందూ పదం జాతి పేరుగా వుండేది. ప్రాదేశిక జాతీయవాదం ప్రకారం దేశంలోని ముస్లింలు, క్రైస్తవులు అందరూ హిందువులే! వినాయక్ దామోదర్ సావర్కర్ 1922లో 'హిందుత్వ ఆవశ్యకతలు' పేరుతో ఒక సిద్ధాంత గ్రంథాన్ని రాశారు. దీన్ని 1923లో 'హిందుత్వ – హిందువు అంటే ఎవరు?' అనే పేరుతో ప్రచురించారు. సావర్కర్ పుస్తకానికి రెండు ప్రత్యేకతలున్నాయి. మొదటిది: హిందూ పదానికి ప్రాదేశిక అర్థాన్ని తొలగించి మతపరమైన అర్థాన్ని ఇచ్చారు. రెండోది: హిందూమత సమూహపు రాజకీయార్థిక సాంస్కృతిక ఆధిపత్యాన్ని సూచించడానికి 'హిందుత్వ' అనే కొత్త పదాన్ని ప్రయోగించారు. ఆ పదం సావర్కర్ స్వీయసృష్టి. అక్కడి నుండి మన రాజకీయాల్లో సాంస్కృతిక జాతీయవాదం ప్రవేశించింది. హిందూమత ప్రాతిపదికగా జాతి నిర్మాణం దీని లక్ష్యం. అంచేత దీన్ని హిందూ జాతీయవాదం అనవచ్చు. వి.డి. సావర్కర్ ప్రతిపాదించిన ద్విజాతి సిద్ధాంతం, హిందూ జాతీయవాదం ప్రేరణతో హిందువులకు రాజ్యాధికారాన్ని సాధించే లక్ష్యంతో 1925లో ఆరెస్సెస్ ఏర్పడింది. ఆ సంస్థ రెండవ సర్సంగ్ ఛాలక్ గురూజీ ఎంఎస్ గోల్వాల్కర్ 'బంచ్ ఆఫ్ థాట్స్' అనే గ్రంథంలో హిందూదేశానికి మిత్రులు ఎవరో శత్రువులు ఎవరో వివరించారు. తలనుండి పుట్టినా, ఛాతీ నుండి పుట్టినా, ఉదరభాగం నుండి పుట్టినా కాళ్ళ నుండి పుట్టినా నాలుగు వర్ణాలూ ఒకే విరాట్ పురుషుని దేహం నుండి పుట్టాయి కనుక అవన్నీ పవిత్రమైనవే అనేది వారి వివరణ. వర్ణాల్లో ఒకటి ఎక్కువ అనీ మరొకటి తక్కువ అని భావించడం, హిందూ సమాజంలో నిచ్చెనమెట్ల వ్యవస్థ వుందని చెప్పడం తప్పు అంటూ వారు హిందూ ఐక్యతను బోధించారు. మరోవైపు, ముస్లింలు భారతదేశంలో పుట్టి, ఇక్కడే బతికి, ఇక్కడే చనిపోయినా భారతదేశం వారికి పితృభూమి, కర్మభూమి మాత్రమే అవుతుంది గానీ పుణ్యభూమి మాత్రం కాదు. కాబట్టి వారు 'అన్యులు' అనేది గోల్వాల్కర్ వర్గీకరణ. ఇదే ప్రమాణం క్రైస్తవులు, కమ్యూనిస్టులకు కూడ వర్తిస్తుందని వారొక సిద్ధాంతాన్ని అభివృద్ధి చేశారు. అక్కడితో ఆగకుండా 'ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులు హిందూదేశానికి అంతర్గత ముప్పు' అని ప్రకటించారు. సమాజంలో వ్యష్టి ప్రయోజనాలని పరిరక్షించాలనే ప్రజాస్వామ్యం, సమిష్టి ప్రయోజనాలను కాపాడాలనే సామ్యవాదం రెండూ భారత సమాజానికి పనికిరావని ఎంఎస్ గోల్వాల్కర్ ప్రగాఢ అభిప్రాయం. యజమానులు – శ్రామికులు అనే సామాజికార్థిక విభజన వారికి నచ్చేది కాదు. నాలుగు వర్ణాలవారు ఎవరి హక్కుల్ని వారు ఆస్వాదిస్తూ, ఎవరి బాధ్యతల్ని వారు నిర్వర్తించే వర్ణవ్యవస్థే ప్రపంచంలో నిలిచి వెలుగుతుందని వారు ప్రవచించారు. దేశం బలపడడానికి ఆర్థిక రంగంలో హిందూ పెట్టుబడిదారుల్ని ప్రోత్సహించాలనే మాట గోల్వార్కర్ నాటికే వుంది. అయితే, దేశంలో సామ్యవాద భావాలు, కమ్యూనిస్టు పార్టీల ప్రభావం బలంగావున్న కారణంగా అప్పట్లో ఆరెస్సెస్ దాని రాజకీయ విభాగాలయిన జనసంఘ్, బీజేపీలు పెద్దగా ప్రభావాన్ని చూపలేకపోయాయి. 1990వ దశకం ఆరంభంలో తూర్పు యూరప్, రష్యాల్లో కమ్యూనిస్టు ప్రభుత్వాలు పతనం అయ్యాక, గ్యాట్ ఒప్పందాలు కుదిరాక, సరళీకృత ఆర్థిక విధానం రంగప్రవేశం చేశాక సాంస్కృతిక జాతీయవాదానికి ఆర్థిక జాతీయవాదాన్ని జత చేశారు. ఈ ఘనత లాల్ కిషన్ ఆడ్వాణీకి దక్కుతుంది. బడా పెట్టుబడిదారీ సంస్థలు ఆరెస్సెస్, బీజేపీలను ప్రోత్సహించడం మొదలెట్టాయి. ఈ ఫార్ములా రెండు పక్షాలకూ ప్రయోజనకారిగా మారింది. ఇరువురూ ఒక అవగాహనతో ఒకరినొకరు సమర్థించుకుంటూ ఒకరు ఆర్థిక రంగంలో, మరొకరు రాజకీయ రంగంలో బలపడ్డారు. నరేంద్ర దామోదర్ దాస్ మోదీజీ 2001 చివర్లో గుజరాత్ ముఖ్యమంత్రి అయ్యాక సాంస్కృతిక జాతీయవాదం, ఆర్థిక జాతీయవాదం కొత్త పుంతలు తొక్కాయి. నరేంద్ర మోదీజీ చొరవతో గుజరాత్‌లో హిందూ జాతీయవాదం గుజరాత్ జాతీయవాదంగా, గుజరాత్ ఆర్థిక జాతీయవాదంగా కొత్త శక్తిని పుంజుకుంది. గుజరాత్ మోడల్‌నే భారతదేశ మోడల్‌గా మార్చడానికి గుజరాతీ మెగా కార్పొరేట్లు గుజరాత్ ముఖ్యమంత్రిని దేశప్రధానిగా మార్చుకున్నారు. మోదీజీ ప్రధాని అయ్యాక గుజరాత్ మెగా కార్పొరేట్లకు భారీ మేళ్ళు జరిగాయన్న అభిప్రాయం బలంగా ఉంది. దీనినే చాలామంది ప్రయోజిత పెట్టుబడీదారీ వ్యవస్థ (క్రోనీ కేపిటలిజం) అంటున్నారు. అందుకు భిన్నంగా, గుజరాత్ మెగా కార్పొరేట్లే తమ ధనబలాన్నీ, మీడియా బలాన్నీ ప్రయోగించి తమకు అనుకూలురైన మోదీజీని దేశప్రధాని కుర్చీలో కూర్చోబెట్టుకున్నారనే వాదనా వుంది. దీనినే ప్రయోజిత ప్రజాస్వామ్యం (క్రోనీ డెమోక్రసీ) అంటున్నారు. రాజకీయార్థిక రంగాల్లో ఇటీవలి పరిణామాల్ని లోతుగా గమనిస్తే దేశంలో ప్రయోజిత ప్రజాస్వామ్యం కొనసాగుతున్నదనే వాదనకే బలం చేకూరుతోంది. క్రోనీ డెమోక్రసీ అంటే ప్రజాస్వామ్యానికి నాలుగు మూల స్థంభాలయిన శాసన, కార్యనిర్వాహక, న్యాయ, మీడియా వ్యవస్థల పనితీరు ప్రాయోజిత కార్యక్రమాలుగా మారిపోయాయని అర్థం. క్రోనీ డెమోక్రసీ అనేది కొత్త సిద్ధాంతం ఏమీకాదు. మనం పెద్దగా పట్టించుకోలేదుగానీ మార్క్సిస్టు మూల సూత్రాల్లోనే ఈ ప్రస్తావన వున్నది. 'పెట్టుబడీదారీ వ్యవస్థ తన ప్రయోజనాలకు అనుకూలమైన పార్లమెంటరీ వ్యవస్థను రూపొందించుకున్నది' అని కార్ల్ మార్క్స్ అన్నాడు. పెట్టుబడీదారులు తమ ప్రయోజనాలను నెరవేర్చిపెట్టే రాజకీయ నాయకుల్ని దేశాధినేతలుగా నియమించుకునేందుకు ఇది అవకాశం ఇస్తుంది. గుజరాతీ మెగా కార్పొరేట్లు తమ ప్రతినిధిని దేశాధినేత స్థానంలో పెట్టుకునే స్థాయికి ఇప్పుడు ఇది అభివృద్ధి చెందింది. ఉత్తర భారతదేశం, దక్షిణ భారతదేశాన్ని అణిచివేస్తున్నదనే వాదనలు గోల్వార్కర్ నాటికే వున్నాయి. దక్షిణాదికి చెందిన ఆదిశంకరాచార్యను తాము ఎంతగా గౌరవిస్తారో వారు చాలా వివరంగా చెప్పుకొచ్చారు. అయినప్పటికీ ఆ వివాదం మళ్ళీ రాజుకుంది. దక్షిణాది ఆరు రాష్ట్రాల్లో ఎక్కడా ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం లేకపోవడం దీనికి ఒక సంకేతం. ఇప్పుడు ఉత్తరాది వ్యతిరేకతతోపాటూ గుజరాతీ వ్యతిరేకత కూడా దేశమంతటా క్రమంగా పుంజుకుంటున్నది. ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టుల్ని సామాజికంగా వెలివేస్తున్నాం, ఆర్థికంగా అణచివేస్తున్నాం, రాజకీయంగా దూరంగా పెడుతున్నాం అని చెప్పడం ద్వారా కరడుగట్టిన హిందూత్వవాదుల్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు సంఘపరివారం చేస్తున్నది. అయోధ్యలో రామాలయ నిర్మాణం ద్వారా సామరస్య హిందువులని సంతృప్తిపరచే ప్రయత్నం చేస్తున్నది. ఇలాంటి ముసుగులు ఎన్ని కప్పినా కేంద్ర ప్రభుత్వ గుజరాతీ పక్షపాతం అందరికీ స్పష్టంగానే కనిపిస్తున్నది. జాగ్రత్తగా గమనిస్తే ఉత్తర – దక్షిణ వివాదంకన్నా, గుజరాతీ వ్యతిరేక వివాదం వేగంగా రగులుకుంటున్నది.

## పది' మూల్యాంకనానికి సర్వం సిద్ధం...!




**సంగారెడ్డి అర్బన్ :** పదో తరగతి పరీక్షలు ముగియడంతో జవాబు పత్రాల మూల్యాంకనానికి విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పరిధిలోని జ్యోతి విద్యాలయ హైస్కూల్‌లో మూల్యాంకనం చేపట్టనున్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి 11 వరకు జవాబు పత్రాలను దిద్దనున్నారు. ఈ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అవసరమైన ఏర్పాట్లు చేసింది. కాగా మూల్యాంకనం పూర్తికాగానే వచ్చే నెలలో ఫలితాల విడుదల చేయాలని విద్యాశాఖ భావిస్తున్నది. మూల్యాంకన ప్రక్రియ సజావుగా జరిగేందుకు వీలుగా జిల్లా విద్యాశాఖ పలువురికి బాధ్యతలు అప్పగించింది. క్యాంపు అధికారిగా(డీఈవో), డిప్యూటీ క్యాంపు ఆఫీసర్స్ ఇద్దరు, కోడింగ్ క్యాంపు ఆఫీసర్స్ ఇద్దరు, అసిస్టెంట్ కోడింగ్ ఆఫీసర్లు ఆరుగురు, అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు ఆరుగురు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు 632మంది, చీఫ్ ఎగ్జామినర్లు 109, స్పెషల్ అసిస్టెంట్లు 211 మందిని నియమించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఉపాధ్యాయులకు స్పాట్ విధులు కేటాయించారు. అయితే ఈ స్పాట్ క్యాంపులో 2.22 లక్షల జవాబు పత్రాలు దిద్దనున్నారు. ఇప్పటికే పదో తరగతి జవాబు పత్రాలను ప్రత్యేక వాహనాల్లో స్పాట్ కేంద్రమైన జ్యోతి విద్యాలయ హైస్కూల్‌కు చేర్చారు. పోలీస్ పహారా మధ్య స్ట్రాంగ్ రూమ్‌ను ఏర్పాటు చేసి అందులో భద్రపర్చారు. కేంద్రంలోకి ఇతరులకు ప్రవేశం లేకుండా వి?ధులు కేటాయించిన వారిని మాత్రమే అనుమతించేలా పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశారు.

## ప్రణాళికతో సాగు.. దిగుబడులు బాగు

**వాంకిడి :** రెండు నెలల్లో వానాకాలం సీజన్ ప్రారంభం కానుంది. రైతాంగం ఇప్పటినుంచే సాగుకు సన్నాహాలు చేసుకుంటే మేలు. అయితే ముందస్తు ప్రణాళికతో ముందుకు వెళ్తే అధిక దిగుబడులు, మంచి లాభాలు పొందే అవకాశముంటుంది. భూసార పరీక్షలు, వేసవి దుక్కులు, చేను చదును, విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, ఎరువుల వాడకం, పంటకు అనుగుణంగా భూమిని సిద్ధం చేయడం, తదితర పనులకు ముందస్తుగా ప్రణాళిక తయారు చేసుకుంటే పంట పండించడానికి అదే మంచి మందు అవుతుందని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. తొలకరి వర్షాలు పడేవరకు వేచి చూసి వానాకాలం పనులు ప్రారంభించుకునే కంటే ముందునుంచే సాగుకు సన్నద్ధమైతే సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చు. జిల్లాలో ఏటా పత్తి పంట దిగుబడి అనంతరం పత్తిచెట్ల మొదళ్లను కుప్పగా చేసి తగులబెడుతుంటారు. అలా కాకుండా రోటవేటర్ సహాయంతో భూమిలో తేమ ఉన్నప్పుడు కలియదున్నాలి. తర్వాత మరోసారి రోటవేటర్‌తో దున్నాలి. ఇలా చేస్తే భూసారం పెరగడమేకాకుండా పత్తి పంటకు కావాల్సిన కృత్రిమ ఎరువులను తగ్గించవచ్చు. ఈ పద్ధతి జిల్లాలో అక్కడక్కడ కొన్ని గ్రామాల్లో మాత్రమే రైతులు ఆచరించి లాభం పొందుతున్నారు. వానాకాలం సాగుకు ముందునుంచే పంట పొలాలను చదును చేసుకుని నెలరోజుల ముందు వేసవిదుక్కులు దున్నుకోవాలి. తొలకరికి ముందే పంట విత్తుకోవడానికి భూములను సిద్ధం చేసుకోవాలి. వర్షాలకు ముందే విత్తుకోవడానికి భూములను తయారు చేసుకోవాలి. పంట కోతలతర్వాత భూమిని వృథాగా వదిలివేయకుండా వేసవిలో దుక్కి దున్నినట్లయితే చీడపీడలను కొంత వరకు నివారించవచ్చు. నేలను లోతుగా దున్నడంతో కొంత తేమలో ఉన్న కీటకాలు నశిస్తాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలను సద్వినియోగం చేసుకుని భూమిని దున్నుకోవాలి. ఈ వర్షాలతో లోతుగా దున్నడం మూలంగా వరుస వరుసకు మధ్యలో వర్షపునీరు నిలిచి భూమిలోనికి చేరుతుంది. మొదటిసారి దుక్కులు దున్నిన తర్వాత రెండోసారి దున్నే ముందు పశువుల ఎరువు, వర్మీకంపోస్టుగానీ, వ్యవసాయ అధికారులు సూచించిన చెరువు మట్టిని గానీ పొలంలో వేసుకోవాలి. దీంతో పంటదిగుబడి సామర్థ్యం



పెరుగుతుంది. సేంద్రియ ఎరువులను అందించడం ద్వారా సూక్ష్మపోషక లోపాలను నివారించవచ్చు. లోతుదుక్కులు దున్నడం చాలా ఉపయోగం. 35–40సెంటీమీటర్ల లోతుగా దుక్కి చేయడంవల్ల భూమిలో గట్టిపొర పగిలి నేల బాగా గుల్లబారుతుంది. వర్షపు నీరు భూమిలోకి ఇంకుతుంది. ఇంకిన నీరు భూమిలో నిలువ ఉండడంవల్ల పంట వేర్లు లోపలి పొరల్లో పెరిగి ఎక్కువ నీటిని, పోషక పదార్థాలను గ్రహించడానికి వీలవుతుంది. లోతు దుక్కిన ప్రభావం 2–3 సంవత్సరాల వరకు ఉండడంతో పంటల దిగుబడులకు భూములు అనుకూలంగా ఉంటాయి. మనిషిలో వ్యాధి నిర్ధారణకు ఏ విధంగానైతే రక్త, మూత్ర పరీక్షలు అవసరమో పంటకు కూడా భూసార పరీక్షలు అవసరమే. భూసార పరీక్షకు ముందు మట్టి నమూనాలు సరైన పద్ధతిలో తీసుకోవాలి. భూమిలో సారం ఎంతవరకు ఉంది. ఎలాంటి విత్తనాలు, ఎంత మోతాదులో ఎరువులు వాడాలి అనేది తెలుసుకోవడానికి భూసార పరీక్షలు కీలకం. అధిక దిగుబడికి పోటీపడి ఎక్కువ మోతాదులో ఎరువులు వేసి నష్టాలు కొనితెచ్చుకునే కంటే భూసార విలువలు తెలుకుని కాలానికి అనుగుణంగా పంటల సాగు తీరు మార్చుకోవాల్సిన అవసరం ఉంది. భూసార పరీక్షలపై ప్రభుత్వం విస్తృతప్రచారం చేస్తూ రైతులకు అవగాహన కూడా కల్పిస్తోంది.

# ఇస్తాంబుల్ నైట్‌క్లబ్‌లో అగ్నిప్రమాదం

**ఇస్తాంబుల్ :** ఇస్తాంబుల్ నైట్‌క్లబ్‌లో చెలరేగిన అగ్ని ప్రమాదంలో 29 మంది మరణించారని అధికారులు మంగళవారం తెలిపారు. క్లబ్ పునరుద్ధరణ పనుల సందర్భంగా ఈ ప్రమాదం సంభవించింది. ఈ ఘటనకు సంబంధించి క్లబ్ మేనేజర్లతో సహా మొత్తంగా ఐదుగురిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. గాయపడిన ఒక వ్యక్తికి ఆస్పత్రిలో చికిత్సనందిస్తున్నారు. ఈ మేరకు ఇస్తాంబుల్ గవర్నర్ కార్యాలయం ఒక ప్రకటన జారీ చేసింది. 16 అంతస్తుల నివాస భవనంలో నైట్ క్లబ్ గ్రౌండ్, బేస్‌మెంట్ ఫ్లోర్‌లలో వుంది. మరమ్మత్తులు జరుగుతున్న కారణంగా దీన్ని మూసివేశారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నట్లు గవర్నర్ దావుత్ గుల్ విలేకర్లకు తెలిపారు. బహుశా పునరుద్ధరణ కార్యకలాపాల్లో పాల్గన్నవారే బాధితులై వుంటారని అనుమానిస్తున్నారు. ప్రస్తుతం భవనం భద్రతను అంచనా వేసేందుకు అధికారులు మొత్తంగా తనిఖీలు చేస్తున్నారని మేయర్ తెలిపారు. సమాచారం తెలియగానే అనేక అగ్నిమాపక యంత్రాలు సంఘటనా స్థలానికి చేరుకుని, మంటలను వెంటనే అదుపులోకి తెచ్చాయి.



# తెలంగాణ జిల్లాల్లో భారీగా కూంబింగ్

## 20 రోజుల్లో 24 మంది మావోలు ఎన్ కౌంటర్?

**హైదరాబాద్:** తెలంగాణ సరిహద్దులోని ఛత్తీస్గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో భారీ ఎన్ కౌంటర్ జరిగింది. 13 మంది మావోయిస్టులు మృతి చెందారు. భారీ మొత్తంలో మందుగుండు సామగ్రి నిత్యావసర సరుకులు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బీజాపూర్ జిల్లా గంగులూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కోర్చోలి-లేంద్ర అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో బీజాపూర్ ఆఖీఉ, అఖీఖఈ, ౧ఉఈ, అూఃఖీం బృందాలు కూంబింగ్ చేపట్టగా ఎందురు కాల్పులు జరిగాయి. పోలీస్ బృందాలకు మావోయిస్టులకు మధ్య సుమారు ఎనిమిది గంటల పాటు ఎదురుకాల్పులు జరినట్లు సమాచారం. కాల్పుల అనంతరం పోలీసులు సెర్చ్ చేయగా ముగ్గురు మహిళలతో సహా 13 మంది మావోయిస్టుల మృతదేహాలు లభించాయి. సంఘటన స్థలం నుంచి భారీ మొత్తంలో మందుగుండు సామగ్రి, ఒక ఏకే 47, ఒఓఉ ఆయుధం, 303 బోర్ రైఫిల్, 12 బోర్ రైఫిల్స్, రాకెట్ లాంచర్లు, భారీ పరిమాణంలో ఃఉఒ షెల్స్, విప్లవ సాహిత్యం, నిత్యావసర సరుకులు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 13 మంది మావోయిస్టుల మృతదేహాలను బీజాపూర్ జిల్లా కేంద్రానికి తరలించారు. మృతదేహాలను ఇంకా గుర్తించలేదు. చనిపోయిన మావోలు ఎక్కువ మంది ఖఒఉం కంపెనీ నంబర్ 02 కి చెందిన వారేనని ప్రాథమికంగా తెలుస్తోంది. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి బస్తర్, బీజాపూర్ , గడ్చిరోలి జిల్లాలో అలజడి తీవ్రస్థాయిలో కొనసాగుతోంది. తాజా ఘటనతో గడిచిన 20 రోజుల వ్యవధిలో వేర్వేరు చోట్ల జరిగిన ఎన్ కౌంటర్లలో 24 మంది నక్సల్స్ మృతిచెందారు. గడ్చిరోలి జిల్లాలో ఇటీవల జరిగిన ఎన్ కౌంటర్లో తెలంగాణ మావోయిస్టు పార్టీకి చెందిన నలుగురు నక్సల్స్, బీజాపూర్ జిల్లా పిడియాగుట్టలో ఇద్దరు, బాజగూడ అడవుల్లో నలుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఈ ఏడాది ఆరంభం నుంచి ఛత్తీస్ గఢ్ జరిగిన ఎన్కౌంటర్లలో 45 మంది నక్సల్స్ హతమయ్యారు. ఈ ఎన్ కౌంట్లకు నిరసనగా మావోయిస్టు పార్టీ ఏప్రిల్ 3న బుధవారం బీజాపూర్, సుకుమా జిల్లాల బంద్ కు పిలుపునిచ్చింది. బంద్ ను విజయవంతం చేసేందుకు మావోయిస్టులు ఏజెన్సీల్లో తిరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో.. గంగలూరు ఠాణా పరిధిలోని గంగలూరు, లేంద్ర అడవుల్లో కోబ్రా, డీఆర్జీ, బస్తర్ ఫైటర్స్, సీఆర్పీఎఫ్, ఎస్టీఎఫ్ బలగాలు మంగళవారం తెల్లవారుజాము నుంచి కూబింగ్ ప్రారంభించడంతో బారీ ఎన్ కౌంటర్ జరిగినట్లు ఐజీ సుందర్ రాజ్ వెల్లడించారు. బూటకపు ఎన్కౌంటర్ అంటూ మావోయిస్టులు బుధవారం బీజాపూర్, సుకుమా జిల్లాల్లో బంద్ పిలుపునివ్వడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. బంద్ విజయవంతం చేయడానికి మావోయిస్టులు గూడేల్లోకి వస్తే వారిని పట్టుకునేలా కూంబింగ్ ముమ్మరం చేశారు. చత్తీస్ గఢ్ వరుస ఎన్ కౌంటర్ల నేపథ్యంలో సరిహద్దు జిల్లాల్లో తెలంగాణ పోలీసులు సైతం నిఘా పెంచి సరిహద్దులో కూంబింగ్ చేపట్టారు. మావోయిస్టు పార్టీకి దండకారణ్యం సేఫ్ జోన్ అయితే.. ఎండాకాలం మొదలై, అడవంతా ఆకులు రాలుతున్న నేపథ్యంలో మావోయిస్టులకు గడ్డు పరిస్థితులు తప్పవని, గడిచిన 20 రోజుల్లో జరిగిన ఎన్ కౌంటర్లలో మావోయిస్టుల మరణాలు అధికంగా ఉండడానికి కారణమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# లోకసభ నుంచి తప్పుకోవడమే పాపమా

**హైదరాబాద్:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కాంలో తెలుగు రాష్ట్రాల నేతలు కీలక పాత్ర పోషించారు. ఇందులో తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కూతురు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను మార్చి 16న ఈడీ అరెస్ట్ చేసింది. పది రోజుల కస్టడీ అనంతరం తీహార్ జైలుకు తరలించారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కూడా తిహార్ జైలులోనే ఉన్నారు. ఇదిలా ఉండగా ఇదే కేసులో ఆరు నెలల క్రితం అరెస్ట్ అయిన ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్‌కు సుప్రీం కోర్టు ఏప్రిల్ 2న బెయిల్ మంజూరు చేసింది. విచారణ పూర్తయ్యే వరకూ ఈ బెయిల్ ఉంటుంది. అయితే బెయిల్ రావడానికి ప్రధాన కారణం ఆయన పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయడమే. తన రాజకీయ అవసరాలను దెబ్బకొట్టేందుకు, ఎన్నికల్లో పోటీ, ప్రచారం చేయకుండా ఉండేందుకు తనను కేసులో ఇరికించారని సంజయ్‌సింగ్ సుప్రీకోర్టులో వాదించారు. ఇదే సమయంలో సంజయ్‌సింగ్‌కు డబ్బు ఎలా చేరిందో ఈడీ ఆధారాలు చూపలేదు. దీంతో సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. సంజయ్‌సింగ్‌కు బెయిల్ మంజూరు అయిన నేపథ్యంలో ఇప్పుడు కల్వకుంట్ల కవిత బెయిల్ అంశం తెరపైకి వచ్చింది. ఆమె ట్రయల్ కోరుట్లో బెయిల్ పిటిషన్ వేశారు. తన కొడుకుకు పరీక్షలు ఉన్నందున మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరారు. కానీ ఈడీ బెయిల్‌ను వ్యతిరేకించడంతో విచారణ వాయిదాపడింది. కవిత కూడా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఉంటే.. సంజయ్ సింగ్ తరహాలో బెయిల్ మంజూరయ్యేది అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే సంజయ్‌సింగ్ సిట్టింగ్ ఎంపీ అయినందున బెయిల్ మంజూరైందని కొందరు అంటున్నారు. అయితే కవిత సిట్టింగ్ ఎంపీ కానప్పటికీ.. బీఆర్ఎస్ తరపున ఎన్నికల ప్రచారం చేస్తారు. ఈ నేపథ్యంలో ఆమె రాజకీయ అవకాశాలను దెబ్బతీయాల్సిన అవసరం లేదు. ఈమేరకు కోర్టుకు విన్నవించే అవకాశం ఉంటుంది. ఇదిలా ఉండగా ఈడీ మాత్రం కవితకు బెయిల్ ఇవ్వొద్దని గట్టిగా వాదిస్తోంది. కానీ, సంజయ్ సింగ్‌కు బెయిల్ వచ్చిన నేపథ్యంలో కవితకు కొంత అవకాశాలు ఉండేవన్న చర్చ జరుగుతోంది. అయితే కవిత ఇప్పుడు రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఆమె రాజకీయ కారణాలతో బెయిల్ కోరకపోవచ్చని తెలుస్తోంది. కవిత ఆధ్యాత్మిక బాటలో జపమాల, ఆధ్యాత్మిక పుస్తకాలు, మెడిటేషన్ చేస్తున్నారని తెలుస్తోంది. జైల్లో చదువుకోవటానికి ఇతరత్రా పుస్తకాలను కూడా అడిగారు. అందుకు కోర్టు కూడా సానుకూలంగా స్పందించింది.

# ఆప్ ఎంపీ సంజయ్ సింగ్‌కు బెయిల్ లిక్కర్ కేసుపై వ్యాఖ్యలు చేయొద్దని షరతు



న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆప్ నేత, ఎంపీ సంజయ్ సింగ్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆయన స్వేచ్ఛగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనవచ్చని స్పష్టం చేసింది. ఇదే కేసులో ఆప్ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను తీహార్ జైలుకు తరలించిన 24 గంటల్లోనే ఈ పరిణామం చోటు చేసుకుంది. అయితే ట్రయల్ కోర్టు ఇచ్చిన షరతులు అమలులో ఉంటాయని స్పష్టం చేసింది. ఎంపీ సంజయ్ సింగ్ రాజకీయ సభలు, సమావేశాల్లో పాల్గొనవచ్చని, లిక్కర్ స్కాం కేసుకు సంబంధించి ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదని పేర్కొంది. అలాగే ఈడీ అరెస్ట్, రిమాండ్‌కు సంబంధించి సంజయ్ సింగ్ దాఖలు చేసిన రెండో పిటిషన్‌ను కొట్టివేసింది. ఢిల్లీ లిక్కర్ స్కాం వ్యవహారంలో సహ నిందితుడు (అప్రూవర్‌గా మారిన) దినేశ్ అరోరా, ఎంపీ సంజరు సింగ్‌కు రూ. 2 కోట్లు ఇచ్చినట్టు ఈడీకి స్టేట్మెంట్ ఇచ్చారు. ఈ స్టేట్మెంట్ ఆధారంగా గతేడాది అక్టోబర్ 4న ఎంపీ సంజయ్ సింగ్ నివాసంలో ఈడీ సోదాలు నిర్వహించింది. ఆ తరువాత ఆయనను అరెస్ట్ చేసింది. అనంతరం ఈడీ కస్టడీ ముగిసిన తరువాత జ్యుడీషియల్ రిమాండ్‌లో భాగంగా సంజరు సింగ్‌ను తీహార్ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో తన అరెస్ట్, రిమాండ్‌ను సవాల్ చేస్తూ, బెయిల్ పిటిషన్‌పై రెండు వేరు వేరు పిటిషన్లు దాఖలు చేశారు.

# మోడీకి శ్రీలంకను ఖండించే దమ్ముందా..?


## తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్



శ్రీలంకను ఖండించే దమ్ము ప్రధాని మోడీకి ఉందా? కచ్చతీవు దీవుల గురించి అక్కడికి వెళ్లి మాట్లాడగలరా ? అని డిఎంకె నేత , తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ప్రశ్నించారు. మంగళవారం నాడిక్కడ జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ, ఇప్పుడు భారత ప్రభుత్వం శ్రీలంకకు కచ్చతీవి ఇవ్వడంపై బిజెపి మాట్లాడటం ప్రారంభించింది. కానీ , ఇది వారికి వ్యతిరేకంగా మారింది. ఇప్పుడు కందిరీగ తుట్టెలో చేయిపెట్టిన బిజెపి అందులో ఇరుక్కుపోయి గిజగిజలాడుతోందన్నారు..2014 లో అధికారంలోకి వచ్చిన బిజెపి సుప్రీంకోర్టులో ఏం చెప్పింది ? " మేము ద్వీపాన్ని తిరిగి పొందాలనుకుంటే, మేము శ్రీలంక ప్రభుత్వంతో యుద్ధం చేయవలసి ఉంటుంది " అని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ దశాబ్దంలో ప్రధాని మోదీ శ్రీలంకను ఎన్నిసార్లు సందర్శించారు ? కనీసం ఒక్కసారైనా కచ్చతీవు గురించి మాట్లాడారా? శ్రీలంక అధ్యక్షుడిని కలిసినప్పుడల్లా కచ్చతీవు భారత్‌కే చెందుతుందని చెప్పారా ? ఆ సమయంలో మోడీకి కచ్చతీవు గుర్తుకు రాలేదు. నెహ్రూ హయాంలో ఇందిరా కాలంలో జరిగినవన్నీ గుర్తున్న మోడీకి రెండేళ్ల క్రితం జరిగిన సంఘటన గుర్తుకు రావడం లేదా? అని ప్రశ్నించారు. ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ కొందరు ' పార్ట్ టైమ్ ' రాజకీయ నాయకులు తమిళనాడుకు వస్తున్నారు. 'నేనెవరో మీకు తెలుసు. ప్రధాని మోడీ ఎలాంటి వారో మీకు తెలుసు. ఎన్నికల సీజన్‌లో మాత్రం రాష్ట్రంలో పర్యటనలు జరుపుతారు. అబద్ధాలు , దూషణలు, విద్వేషాలను ప్రసంగం నిండా దట్టిస్తారు. రాష్ట్రంలో వరదలొస్తే ఇటువైపు తొంగిచూడరు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన నిధులు అడిగితే ఇవ్వరు. రాష్ట్ర ప్రజలను మోసం చేసినవారు ఇప్పుడు తమిళనాడును ఉద్ధరిస్తామంటూ ముందుకొస్తున్నారు. ఇటువంటి పార్ట్‌టైమ్ రాజకీయ నాయకులను ఉపేక్షించకండి' అని ఓటర్లకు స్టాలిన్ విజ్ఞప్తి చేశారు.

# తైవాన్‌లో అతిపెద్ద భూకంపం

తైవాన్ : తైవాన్‌లో భారీ భూకంపం సంభవించింది. తైవాన్ కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 8 గంటల సమయంలో ఈ విపత్తు సంభవించింది. 1999 తర్వాత తైవాన్‌ను ప్రభావితం చేసిన అతిపెద్ద భూకంపం ఇదేనని నిపుణులు చెబుతున్నారు. జపాన్ సహా మరికొన్ని దేశాలకు సునామీ హెచ్చరికలను అధికారులు జారీ చేశారు. ఈ విపత్తులో జరిగిన ఆస్తి, ప్రాణ నష్టం వివరాలు తెలియాల్సి ఉంది. ఈ భారీ భూకంపం తైవాన్ సహా జపాన్ దక్షిణ ప్రాంతంలోని దీవులలో బీభత్సం సృష్టించింది. ఆ దేశ 'భూకంప పర్యవేక్షణ సంస్థ' ప్రకంపనల తీవ్రతను రిక్టర్ స్కేల్‌పై 7.2గా గుర్తించగా.. 'అమెరికా జియోలాజికల్ సర్వే దీన్ని 7.4గా పేర్కొంది. తైవాన్‌లోని హువాలియెన్ పట్టణానికి నైరుతి దిశలో 18 కిలోమీటర్ల దూరం, 35 కి.మీ లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. దీని తర్వాత 6.5 తీవ్రతతో మరో భూకంపం కూడా సంభవించినట్లు యూఎస్‌జీఎస్ వెల్లడించింది. భూకంపం వల్ల వచ్చిన సునామీ అలలు తైవాన్ తూర్పు తీరంలోని హువాలియెన్ పట్టణాన్ని తాకాయి. పెద్ద ఎత్తున భవనాలు ధ్వంసమయ్యాయి. ఒక ఐదంతస్తుల భవనం 45 డిగ్రీల కోణంలో



ఒరిగిపోవడం చిత్రాల్లో కనిపిస్తోంది. రాజధాని తైపీలో అనేక బిల్డింగుల్లో పగుళ్లు వచ్చాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. జపాన్‌లోని కొన్ని దీవుల్లోనూ పెద్ద ఎత్తున ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. ఒకినావా ద్వీప సమూహంలో మూడు మీటర్ల వరకు సునామీ అలలు ఎగిసిపడే ప్రమాదం ఉందని జపాన్ హెచ్చరించింది. భూకంపం సంభవించిన 15 నిమిషాలకు భారీ అల యొనగుని ద్వీపాన్ని తాకినట్లు తెలిపింది. మియాకో, యేయామా ద్వీపాలకు కూడా సునామీ ముప్పు పొంచి ఉందని భూకంప పర్యవేక్షణ సంస్థ వెల్లడించింది.

# చేనేతలను దూరం పెడుతున్న పార్టీలు....!

రాజకీయ పోరాటానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చేనేత కులాలన్నీ ఏకమవుతువున్నాయి. తమ బల ప్రదర్శనకు సిద్ధమవుతున్నాయి. రాష్ట్ర జనాభాలో దాదాపు 13 శాతం, అంటే 65 లక్షల మంది ఉన్న, చేనేతలకు ఒక్క ఎంపీ టికెట్ కూడా ఇవ్వని పార్టీలను చూసి ఈ వర్గం ప్రజలు విసిగిపోయారు. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీ ఒక్కొక్కటి కనీసం 5 ఎమ్మెల్యే టికెట్లు, ఒక ఎంపీ టికెట్ కేటాయించాలన్నది చేనేత కులాల, సంఘాల ఐక్యవేదిక డిమాండ్. ఏపీ ప్రభుత్వం గుర్తించిన బీసీ-బి జాబితా ప్రకారం పద్మశాలి, దేవాంగ, తొగట, తొగటి, తొగట వీర క్షత్రియ, కుర్ని, పట్టుశాలి, శాలి, స్వకులశాలి, కరికాలభక్తులు, కైకోలన్, సెంగుండం, సెంగుంతర్, జాంద్ర, కురిమిసెట్టిశాలి, సేనాపతులు, కర్ణభక్తులు, శాలివన్, సేనాపతులు, స్వకుల శాలి తదితర కులాలకు చెందిన వారిలో అత్యధిక మంది చేనేత, దాని అనుబంధ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలో చేనేత కులాలవారు ఉన్నారు. వారిలో దేవాంగులు, పద్మశాలీలు అత్యధిక మంది ఉన్నారు. మంగళగిరి, చీరాల, పెడన, రాజంపేట, కడప, రాజమండ్రి, రాజమండ్రి రూరల్, హిందూపురం, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మదనపల్లి, వెంకటగిరి, తాడిపత్రి, ధర్మవరం, పుట్టపర్తి, ఎమ్మిగనూరు, ఆదోని, కదిరి, ఏలూరు, విశాఖపట్నం, గాజువాక, భీమిలి, విజయనగరం, అనపర్తి, ఉప్పాడ, పిఠాపురం తదితర నియోజకవర్గాల్లో చేనేత జనాభా గణనీయంగా ఉంది. అయినా, రాష్ట్రంలోని రెండు ప్రధాన పార్టీలు టీడీపీ, వైసీపీ ఒక్క ఎంపీ టికెట్ కూడా చేనేత వర్గానికి కేటాయించలేదు. అటు అధికార వైసీపీ సైతం మంగళగిరి, ఎమ్మిగనూరు రెండు చోట్ల ఇవ్వగా, టీడీపీ కదిరి టికెట్ ఒక్కటి మాత్రమే ఇచ్చింది. ఈ పార్టీలు 50 లక్షల లోపు ఉన్న కులాల వారికి 20, 30 సీట్లు కేటాయించగా, 65 లక్షల జనాభా ఉన్న చేనేత కులాలకు రెండు పార్టీలు కలిపి మూడు మాత్రమే కేటాయించడం వారికి ఆగ్రహాన్ని తెప్పించింది. చేనేత సామాజిక వర్గం పద్మశాలీలు అధికంగా ఉన్న నియోజకవర్గం మంగళగిరిలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పోటీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ కర్నూలు ఎంపీ టికెట్ సిట్టింగ్ ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్‌కు ఇస్తారని, అలాగే చీరాల టికెట్ కూడా పద్మశాలి లేదా దేవాంగులకు ఇస్తారని భావించారు. కానీ టీడీపీ వీరికి ఒక్క టికెట్ కూడా కేటాయించలేదు. చీరాలలో చేనేత కులాలకు చెందినవారు దాదాపు 75 వేల మంది ఉన్నారు. చీరాలకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ సీఈఓ, తెలుగు యువత నేత, పద్మశాలి యువకుడు చాత్రాసి రాజేష్ చీరాల నుంచి పోటీ చేయడానికి ముందుకు వచ్చారు. ఆయన లోకేష్‌కు సన్నిహితంగానే ఉంటారు. కానీ, ఆయనకు కూడా టికెట్ కేటాయించలేదు. అక్కడ యాదవ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి టీడీపీ టికెట్ ఇచ్చింది. అయితే, ఆయన నోరుజారి చేనేత వర్గానికి చెందినవారిని బండబూతులు తిట్టారు. దాంతో టీడీపీ అధిష్టానం అతనిని మార్చే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో రాజేష్‌కు టీడీపీ టికెట్ కేటాయించే అవకాశం ఉంది. టీడీపీ ఆయనకు టికెట్ ఇవ్వకపోతే, చీరాలలోని చేనేత కులాలవారందరూ ఏకమై ఆయనను ఇండిపెండెంట్‌గా పోటీ చేయడానికి ఒప్పించాలన్న ప్రయత్నంలో ఉన్నారు. అయితే, అందుకు ఆయన సుముఖంగా లేరు. చీరాల టికెట్ చేనేత వర్గాలకు ఇస్తే, రాష్ట్రంలోని చేనేత కులాల వారందరూ ఏకమై, ఇతర బీసీ కులాల సహకారంతో చీరాలపై దృష్టిపెట్టి పట్టుదలతో తమ అభ్యర్థిని గెలిపించుకుంటామని వారు చెబుతున్నారు. వైసీపీ వారు ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ డిప్యూటీ సీఎం, మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాల నాయుడుకి అనకాపల్లి ఎంపీ టికెట్, ఆయన కుమార్తె ఈర్లి అనురాధకు మాడుగుల ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు. ఒక కుటుంబంలోనే ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చిన పార్టీ ఒక కులం లేదా చేనేత కులాలలో 65 లక్షలకు పైగా జనాభా ఉన్నవారికి కనీసం ఒక ఎంపీ టికెట్ ఇవ్వదా? అని ప్రశ్నిస్తున్నారు. రెండు ప్రధాన పార్టీలతోపాటు బీజేపీ, జనసేన పార్టీలు ఎంపీ, ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపు విషయంలో చేనేత వర్గానికి అన్యాయం చేశాయని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో దాదాపు 18 శాసనసభ, 5 లోక్ సభ నియోజకవర్గాల్లో ప్రభావం చూపగల స్థాయిలో చేనేత కులాల వారు ఉన్నారు. బీసీ కులాలతో పాటు ఇతర కులాల వారు నిరసనలు తెలియజేస్తూ, డిమాండ్ చేస్తూ సీట్లు సాధించుకోగలుగుతున్నారు. చేనేత కులాలలో ఐక్యతా లోపం వల్ల వారి జనాభా స్థాయిలో నిరసన వ్యక్తం చేయలేకపోతున్నారు. డిమాండ్ చేయలేకపోతున్నారు. వాస్తవానికి చేనేత వర్గాలలో తిరుగుబాటు స్వభావం తక్కువ. అందువల్ల కూడా వారు రాజకీయంగా ఎదగలేకపోతున్నారు. నష్టపోతున్నారు. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీ ఒక్కొక్కటి కనీసం 5 ఎమ్మెల్యే టికెట్లు, ఒక ఎంపీ టికెట్ కేటాయించాలన్నది చేనేత కులాల, సంఘాల ఐక్యవేదిక డిమాండ్. జనసేన, బీజేపీ కూడా ఒక్కో టికెట్ అయినా ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. ఇప్పటికైనా సమయం మించిపోలేదని ఇంకా సమయం ఉన్నందున ప్రధాన పార్టీలు ఒక్కో ఎంపీ టికెట్ ను, చీరాల ఎమ్మెల్యే టికెట్ ను చేనేత వర్గాల వారికి కేటాయించాలని వారు కోరుతున్నారు. దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పించేది చేనేత రంగమే. చట్టసభలలో తమ వర్గం వారు లేకపోతే తమ సమస్యలను లేవనెత్తేవారే ఉండరన్నది వారి ఆవేదన. ఇప్పటికైనా సమయం మించిపోలేదని ఇంకా సమయం ఉన్నందున ప్రధాన పార్టీలు ఒక్కో ఎంపీ టికెట్ ను, చీరాల ఎమ్మెల్యే టికెట్ ను చేనేత వర్గాల వారికి కేటాయించాలని వారు కోరుతున్నారు.

# రాత్రి మిగిలిపోయిన ఆహారం తింటున్నారా...?



కొంతమంది రాత్రి మిగిలిపోయిన ఆహారాలను ఫ్రిడ్జ్‌లో పెట్టి ఉదయాన్నే మళ్లీ వేడిచేసి తింటారు. డబ్బులు ఆదా చేయడానికి, ఆహారపదార్థాలను వేస్ట్ చేయకూడదనే వీరి ఆలోచన బాగానే ఉంది. కానీ ప్రతి ఆహారం ఇలా తినడం వల్ల తర్వాత ఆస్పత్రి బిల్లు చెల్లించలేక అవస్థపడాల్సి ఉంటుంది. ఎందుకంటే కొన్ని మిగిలిపోయిన ఆహారాలు చాలా ప్రమాదకరం. ఇవి బ్యాక్టీరియాతో సంబంధం కలిగి ఉంటాయి. వీటిని సరిగ్గా స్టోర్ చేయకపోతే లేదా సరిగ్గా వేడి చేయకపోతే ఫుడ్ పాయిజనింగ్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఒక్కోసారి ఇది ప్రాణాంతకంగా మారుతుంది. బాక్టీరియా వంటశాలలతో పాటు ప్రతిచోటా ఉంటాయి. ఇది తేమ, ఉష్ణోగ్రతతో వేగంగా వృద్ధి చెందుతుంది. 20 నిమిషాల్లో సంఖ్య రెట్టింపు అవుతుంది. అందుకే మిగిలిన ఆహారాన్ని వీలైనం త త్వరగా దాదాపు రెండు గంటలలోపు ఫ్రిజ్ లేదా ఫ్రీజర్‌లో ఉంచడం ముఖ్యం. అలాగే మిగిలి పోయిన ఆహారం గాలి చొరబడని ప్లాస్టిక్ డబ్బాలో పెట్టాలి. దీనివల్ల దానికి గాలి తగలకుండా ఉంటుంది. దీంతో బ్యాక్టీరియా పెరగకుండా ఉంటుంది. మీ ఫ్రిజ్‌ను సున్నా నుంచి ఐదు డిగ్రీల టెంపరేచర్ మధ్య ఉంచండి. ఎందుకంటే ఈ ఉష్ణోగ్రత మిగిలిపోయిన ఆహారంలో బ్యాక్టీరియా పెరగకుండా నిరోధిస్తుంది. ఫ్రిడ్జ్‌లో పెట్టిన మిగిలిపోయిన ఆహారాన్ని రెండు రోజుల్లోపు తినాలి. తర్వాత హానికరమైన బ్యాక్టీరియా పెరగడానికి సమయం లభిస్తుంది. వాస్తవానికి లిస్టెరియా వంటి జెర్మ్స్ రిఫ్రిజిరేటర్ ఉష్ణోగ్రతలో కూడా పెరుగుతాయి. రెండు రోజులు దాటితే మరింత పెరిగే అవకాశం ఉంది. మీరు మిగిలిపోయిన ఆహారాన్ని ఒకటి కంటే ఎక్కువసార్లు వేడి చేయకూడదు. ఆహారాన్ని వేడి చేసి చల్లబరిచినప్పుడల్లా హానికరమైన బ్యాక్టీరియా పెరగడానికి అవకాశం ఉంటుంది. మీరు మిగిలిపోయిన ఆహారాన్ని మళ్లీ వేడి చేసినప్పుడు బ్యాక్టీరియాను చంపడం కష్టమవుతుంది.

# మూర్ఛ అనేది ఒక తరం నుంచి మరొక తరానికి వ్యాపిస్తుందా..!

గ్రామీణ ప్రాంతాల్లో మూర్ఛ వ్యాధి విషయంలో ఇప్పటికీ అవగాహన కొరవడింది. ఈ సమస్యతో బాధపడుతున్నవారు ఎంత ఇబ్బందిపడుతున్నప్పటికీ నాటువైద్యా న్ని ఆశ్రయిస్తారు కానీ మంచి హాస్పిటల్‌కు తీసుకెళ్లరు. మూర్ఛ అనేది మెదడు సంబంధించిన ఒక వ్యాధి. మెదడు పనితీరులో ఆటంకం కారణంగా ఈ సమస్య వస్తుందని వైద్యులు చెబుతు న్నారు. చాలా సందర్భాలలో మూర్ఛ సమస్య జన్యుపరమైన కారణాల వల్ల సంభవిస్తుంది. అంటే ఈ వ్యాధి ఒక తరం నుంచి మరొక తరానికి సంక్రమిస్తుంది కానీ చాలా మందికి దీని గురించి తెలియదు. కొన్నిసార్లు మూర్ఛ పేషెంట్లను హాస్పిటల్‌కు తీసుకెళ్లినా ట్రీట్‌మెంట్ చివరివరకు కొనసాగించ రు. చికిత్స మధ్యలోనే వదిలేస్తారు. దీని కారణంగా వ్యాధి మరింత తీవ్రమవుతుంది. కానీ సమయానికి చికిత్స అందిస్తే 80 నుంచి 90 శాతం మూర్ఛ రోగులలో ఈ వ్యాధి కంట్రోల్ అవుతుం ది. ఒక వ్యక్తి ఆకస్మిక మూర్ఛ అనుభవిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని గుర్తుంచుకోండి. జన్యుపరమైన కారణాల వల్ల మూర్ఛ వస్తుందని డాక్టర్లు చెబుతున్నారు. దాదాపు 70% మూర్ఛ కేసులు జన్యుపరమైన కారణాలతో సంబంధం కలిగి ఉంటాయి. ఇటీవల ప్రచురించిన పరిశోధన ప్రకారం శరీరంలో ఉన్న 977 జన్యువులు మూర్ఛకు సంబంధించినవి. ఈ జన్యువులను ఫినోటైప్ ఆధారంగా 4 వర్గాలుగా విభజించారు. మూర్ఛ జన్యువులుగా పరిగణించబడే 84 జన్యువులు ఎపిలెప్సీ సిండ్రోమ్‌కు కారణమవుతాయి. తల్లిదండ్రులకు మూర్ఛ సమస్య ఉంటే అది పిల్లలలో కూడా సంభవించే ప్రమాదం ఉంది. ఈ వ్యాధితో బాధపడుతున్న తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. మెదడు పనితీరులో ఆటంకం కారణంగా ఈ సమస్య వస్తుందని వైద్యులు చెబుతు న్నారు. చాలా సందర్భాలలో మూర్ఛ సమస్య జన్యుపరమైన కారణాల వల్ల సంభవిస్తుంది. అంటే ఈ వ్యాధి ఒక తరం నుంచి మరొక




తరానికి సంక్రమిస్తుంది కానీ చాలా మందికి దీని గురించి తెలియదు. కొన్నిసార్లు మూర్ఛ పేషెంట్లను హాస్పిటల్‌కు తీసుకెళ్లినా ట్రీట్‌మెంట్ చివరివరకు కొనసాగించరు.

# తిన్న వెంటనే కడుపులో నొప్పిగా ఉందా..?



ప్రస్తుతం మనం తీసుకుంటున్న ఆహారం, జీవన శైలి కారణంగా అనేక అనారోగ్య సమస్యలు మన చుట్టుముడుతున్నాయి. అందువలన ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు పెద్దవారు. అయితే చాలా మందికి అన్నం తిన్న వెంటనే కడుపులో నొప్పి, తిమ్మిరి లాంటి సమస్యలు వస్తుంటాయి. కానీ ఇది మామూలు అన్నట్లే వదిలేస్తారు. కానీ ఇలాంటి లక్షణాలు కనిపిస్తే అస్సలే నెగ్లెట్ చేయకూడదు అంటున్నారు వైద్యులు. వెంటనే వైద్యుడిని సంప్రదించాలంట. తిన్న తర్వాత కడుపు నొప్పి రావడానికి అల్సర్ ఒక కారణం కావచ్చునంట. దీని వలన తిన్న తర్వాత కడుపులో నొప్పి వస్తుంది. అంతే కాకుండా సరైన టైమ్‌కి ఫుడ్ తినకపోవడం వలన కూడా ఈ నొప్పి వస్తుంది. కడుపు సంబంధిత వ్యాధులలో ఇదొక్కటి. దీని వలన పేగులలో ఇబ్బంది ఏర్పడుతుంది. ఈ రకమైన నొప్పి వస్తే ఎక్కువగా మసాలా ఫుడ్ తినకుండా ఉండాలంట. అంతే కాకుండా ఫుడ్ పాయిజనింగ్ వల్ల కూడా తిన్న తర్వాత కడుపు నొప్పి, తిమ్మిరి లాంటి సమస్యలు వస్తాయి. దీనికి సరైన సమయంలో చికిత్స అందించకపోతే ఇది చాలా తీవ్రంగా మారే అవకాశం ఉంటుదంట. అలాగే పెద్ద పేగులో ఏవైనా సమస్యలు ఉన్నా, తిన్న తర్వాత కడుపు నొప్పి రావడం జరుగుతుందంట. అందువలన ఈ నొప్పి కంటిన్యూగా వస్తుంటే వైద్యుడిని సంప్రదించాలి అంటున్నారు నిపుణులు.

# ఈ వ్యాధులను తరిమికొట్టే సీతాఫలం..!



సీతాఫలాన్ని ఆంగ్లంలో "కస్టర్డ్ యాపిల్" అంటారు . ఇది అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్న భారత ఉపఖండంలో ప్రసిద్ధి చెందిన పండు. సీతాఫలం మాత్రమే కాదు, దాని ఆకులు కూడా చాలా ప్రయోజనాలను కలిగి ఉన్నాయి. దీని ఆకులను ముఖ్యంగా ఆయుర్వేదంలో చాలా ఉపయోగకరంగా భావిస్తారు. ఎందుకంటే ఇది అనేక ఆరోగ్య సమస్యలను నయం చేస్తుంది. మీరు సీతాఫలం ఆకులను జ్యూస్, డికాక్షన్ లేదా టీ రూపంలో తీసుకోవచ్చు. ఇది శరీరానికి అనేక పోషకాలను అందిస్తుంది. మీరు అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. సీతాఫలం ఆకులు మన ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయో తెలుసుకుందాం.

**సీతాఫలం ఆరోగ్య ప్రయోజనాలు:**

సీతాఫలం ఆకుల్లో ఎన్నో పోషకాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఇందులో విటమిన్ ఎ, విటమిన్ బి, విటమిన్ సి, ఐరన్, ఫైబర్, కాల్షియం కూడా ఉన్నాయి. ఇందులో చాలా యాంటీ ఆక్సిడెంట్ ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటానికి, శరీరాన్ని అనేక వ్యాధుల నుండి దూరంగా ఉంచడంలో సహాయపడతాయి. శరీరంలో వాపు, నొప్పి నుండి ఉపశమనాన్ని అందించే యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు కూడా ఇందులో ఉన్నాయి.

**డయేరియా సమస్య నుండి ఉపశమనం:**

సీతాఫలం ఆకులను తీసుకోవడం వల్ల అనేక పొట్ట సంబంధిత సమస్యలు నయమవుతాయి. సీతాఫలంలో టానిన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది అతిసారాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది. అలాగే ఈ ఆకులో ఉండే పీచు అజీర్ణ సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది. గ్యాస్ ఎసిడిటీ వంటి సమస్యలను తగ్గించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది.

# మట్టికుండలో నీటిని తాగితే......! ఈ సమస్యలన్నీ పరార్..!




ఎండలు పెరగడం వల్ల చాలా మంది నీటిని తాగడానికి ఇష్టపడుతూ ఉంటారు. ముఖ్యంగా నీరు తాగడం వల్ల ఎండాకాలం మన శరీరానికి ఎన్నో లాభాలు సైతం ఉన్నాయి. ముఖ్యంగా కుండలోని నీరు తాగడం వల్ల మరిన్ని లాభాలు ఉన్నాయని తెలుస్తోంది. మట్టి కుండలలో ఉంచినటువంటి నీటిని తాగడం అనేది మన భారతీయ సాంప్రదాయ పద్ధతులలో ఒకటిగా చెప్పవచ్చు.. ఇది సింధు నాగరికత కాలం నుంచి ఇప్పటికి కూడా కొనసాగుతూనే ఉంది..మట్టి కుండలోని నీరు తాగడం వల్ల ఆరోగ్య ప్రయోజనాల గురించి చూద్దాం. మట్టి పాత్రలోని నీటిలో ఎక్కువగా ఖనిజాలు పుష్కలంగా లభిస్తాయి. ఇందులోని నీరు కూడా సహజంగానే ఫిల్టర్ చేస్తుంది.. ఇందులో పోరిస్ లక్షణాలు కూడా పుష్కలంగా ఉంటాయి.. దీనివల్ల కలుషితమైన మలినాలను కూడా తొలగిస్తుంది. వీటిని తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా కూడా ఉంటారు. కుండలలోని నీరు సహజంగానే చల్లగా ఉంటుంది. ఫ్రిజ్లో నీళ్ళు తాగడం వల్ల ఎక్కువగా సమస్యలు ఎదురవుతాయి. అందుకే కుండలోని నీరు తాగడం మంచిది అంటూ నిపుణులు సైతం ఎన్నోసార్లు తెలియజేస్తూ ఉంటారు. ఫ్రిజ్లో నీరు తాగడం వల్ల శరీరంలో వేడి ఎక్కువవుతుంది. అందుకే కుండలో నీరు తాగడం వల్ల వేడి తగ్గేలా చేస్తుంది. కుండలోని నీరు తాగడం వల్ల.. జీర్ణ సమస్యలు కూడా దూరమవుతాయి.. మట్టి కుండలు వాడడం వల్ల పర్యావరణానికి కూడా ఎలాంటి నష్టం కలగదు.. మట్టికుండలకు ఉండేటువంటి చిన్న చిన్న కణాల ద్వారా గాలి కుండలోపలికి వెళ్లి అక్కడ ఉండి నీరుని చల్లబరుస్తుందట. మెటబాలిజం సమస్యతో ఇబ్బంది పడేవారు ఎక్కువగా బరువు పెరుగుతారు. దీని వల్ల జీర్ణక్రియ కూడా సరిగ్గా జరగదు.. అలాంటివారికి కుండనీరు చాలా మంచిదని చెప్పవచ్చు. కుండలోని నీటిలో ఎక్కువగా ఖనిజాలు ఉండడం వల్ల ఈ నీరుని తాగితే గాయాలు త్వరగా మానిపోతాయి.. కుండలోని నీటిని తాగడం వల్ల గొంతులో ఎలాంటి సమస్యలు ఉన్న తగ్గిపోతాయి.. అందుచేతనే వర్షాకాలంలో చలికాలంలో అయినా సరే కుండలో నీటిని తాగడం మంచిదని నిపుణులు సైతం తెలియజేస్తూ ఉంటారు. మట్టి కుండలోని నీరు తాగడం వల్ల ఆరోగ్య ప్రయోజనాల గురించి చూద్దాం. మట్టి పాత్రలోని నీటిలో ఎక్కువగా ఖనిజాలు పుష్కలంగా లభిస్తాయి. ఇందులోని నీరు కూడా సహజంగానే ఫిల్టర్ చేస్తుంది.. ఇందులో పోరిస్ లక్షణాలు కూడా పుష్కలంగా ఉంటాయి.. దీనివల్ల కలుషితమైన మలినాలను కూడా తొలగిస్తుంది. వీటిని తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా కూడా ఉంటారు.

# నల్లగోధుమలతో ఆరోగ్యం భేష్..!



మన చుట్టూ పెరిగేటువంటి వాటిలో గోధుమలు కూడా ఒకటి..గోధుమపిండితో తినే వంటకాలు ఎక్కువగా ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి.. మైదా పిండితో పోల్చినప్పుడు గోధుమలు తయారుచేసిన పదార్థాలు తొందరగా జీర్ణం అవుతాయి..అందరికీ గోధుమలు అంటే కచ్చితంగా బ్రౌన్ కలర్ గోధుమలు మాత్రమే తెలుస్తూ ఉంటాయి.. గోధుమలలో నలుపు రంగు గోధుమలు కూడా ఉంటాయి.. సాధారణంగా గోధుమల రేటుతో పోలిస్తే బ్లాక్ గోధుమలు నాలుగు రెట్లు అధికంగా ఉంటుందట. ఈ పంట వల్ల రైతులకు కూడా మంచి లాభం వస్తుందట.. అయితే మరి ఈ బ్లాక్ గోధుమల వల్ల ఆరోగ్య ప్రయోజనాలను ఇప్పుడు చూద్దాం..డయాబెటిస్తో ఇబ్బంది పడేవారు ఈ నల్ల గోధుమలు చాలా అద్భుతంగా పనిచేస్తాయి.. వైట్ రైస్ కు బదులుగా గోధుమ రొట్టెలను తయారు చేసుకొని తినడం వల్ల రక్తంలో ఉండేటువంటి చక్కెర స్థాయిలు తగ్గిపోతాయి.. నల్ల గోధుమలలో ఐరన్ ఎక్కువగా లభిస్తుంది. ఇది రక్తహీనతతో ఇబ్బంది పడేవారికి నల్ల గోధుమలు దివ్య ఔషధంగా పనిచేస్తాయి. వీటితో తయారు చేసేటువంటివి తరచూ తింటూ ఉండడం వల్ల గుండె సంబంధిత సమస్యలు కూడా దూరమవుతాయి. నల్ల గోధుమలలో ఎక్కువగా ఫైబర్ కంటెంట్ ఉంటుంది. దీనివల్ల త్వరగా జీర్ణం కూడా అవుతుందట. ఒత్తిడి డిప్రెషన్ వంటి సమస్యలకు కూడా నల్లటి గోధుమలు చెక్ పెడతాయి.. అధిక బరువుతో ఇబ్బంది పడుతున్న వారికి ఈ నల్ల గోధుమలు బెస్ట్ ఆప్షన్ ప్రతిరోజు వీటి ద్వారా చేసేటువంటివి తినడం వల్ల త్వరగా బరువు తగ్గుతారు. ఈ నల్ల గోధుమలు వేల సంవత్సరాల క్రితమే సాగు చేశారు ఇందులో ఎక్కువగా ప్రోటీన్స్ ,విటమిన్స్, ఖనిజాలు, ఐరన్ ,పొటాషియం, కాపర్ వంటివి పుష్కలంగా లభిస్తాయి.. సాధారణ గోధుమలతో పోలిస్తే ఇందులో ఎక్కువగా పోషకాలు కలిగి ఉంటాయట. నల్ల గోధుమలు క్యాన్సర్ ను కూడా నయం చేయగలిగిన సామర్థ్యం కలిగి ఉంటుంది.. నల్ల గోధుమలతో తయారు చేసేటువంటి వాటిని కనీసం వారంలో రెండు సార్లు తింటే ఎంత ఆరోగ్యంగా ఉండవచ్చట.


# ఎండాకాలంలో చర్మం జిడ్డుగా మారుతోందా...?



ఎండాకాలం వచ్చేసింది. సూర్యుడి వేడికి ఆరోగ్యంతోపాటు చర్మాన్ని కూడా ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాలి. వాతావరణానికి అనుగుణంగా చర్మాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి. చలికాలంలో చర్మం పొడిబారినట్లు అవుతుంది. అదేవిధంగా వేసవిలో మండే ఎండలు, తేమ, వేడి కారణంగా ముఖం జిగటగా మారుతుంది. చెమట, నూనె రెండూ చర్మంపై పేరుకుపోయి జిడ్డుగా కనిపిస్తుంది. దీంతో రోజంతా దుమ్ము, ధూళి ముఖంపై పేరుకుపోతుంది. ఫలితంగా మొటిమలు, బ్లాక్ హెడ్స్ సమస్య ఏర్పడి ముఖం డల్‌గా కనబడుతుంది. ఈ సమస్యను నివారించడానికి అనేక రకాల చర్మ సంరక్షణ ఉత్పత్తులను ఉపయోగిస్తుంటారు. కానీ అవి తాత్కాలికంగా మాత్రమే ఉపశమనం కలిగిస్తాయి. ముఖ్యంగా జిడ్డు చర్మతత్వం కలిగిన వారు వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం, తద్వారా మొటిమలు, బ్లాక్ హెడ్స్, డల్ స్కిన్ వంటి సమస్యలను నివారించవచ్చు. అలాగే వేడి కారణంగా చర్మం జిగటగా అనిపించకుండా, నూనె ఎక్కువగా పేరుకుపోకుండా ఉండేందుకు నిపుణులు సూచిస్తున్న చిట్కాలు ఇవే.. వేసవిలో జిడ్డు చర్మాన్ని సంరక్షించుకునేందుకు ముందుగా ఆహారపు అలవాట్లపై శ్రద్ధ పెట్టాలి. ఆహార అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ద్వారా సగం సమస్యను నివారించవచ్చని ఢిల్లీలోని ఆర్‌ఎంఎల్ హాస్పిటల్‌లోని డెర్మటాలజీ విభాగానికి చెందిన డాక్టర్ భావుక్ ధీర్ సూచిస్తున్నారు.

# మూవీ మసాలా






## విక్రమ్ చియాన్ 62లో
# కోలీవుడ్ భామ

కోలీవుడ్ స్టార్ హీరో ఛియాన్ విక్రమ్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తున్నాడని తెలిసిందే. ఇప్పటికే తంగలాన్, ధ్రువ నక్షత్రం సినిమాలతో బిజీగా ఉండగా.. మరోవైపు Chiyaan 62కు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. చిన్నా ఫేం ఎస్‌యూ అరుణ్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో పాపులర్ యాక్టర్ కమ్ డైరెక్టర్ ఎస్‌జే సూర్య, పాపులర్ మలయాళ నటుడు సూరజ్ వెంజరమూడు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా చియాన్ 62లో మరో యాక్టర్ జాయిన్ కాబోతున్నారని సస్పెన్స్‌లో పెట్టిన మేకర్స్ క్రేజీ అప్‌డేట్ ఇచ్చేశారు. ఈ మూవీలో తమిళ నటి దుషారా విజయన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ రిలీజ్ చేసిన లుక్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. విక్రమ్ మరోవైపు ఇప్పటికే అడ్వెంచరస్ హిస్టారికల్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న తంగలాన్‌తో బిజీగా ఉన్నాడు. పా రంజిత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని 2024 ఏప్రిల్ 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ఇప్పటికే లాంఛ్ చేసిన తంగలాన్ గ్లింప్స్‌తోపాటు ఫస్ట్ లుక్ పోస్టర్లు సినిమాపై క్యూరియాసిటీ అమాంతం పెంచేస్తున్నాయి. బంగారం, రక్తం, కన్నీటి చుట్టూ సాగే కథ అంటూ విక్రమ్ తన సైన్యంతో సమరాన్ని వెళ్తున్న లుక్ గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. ఈ చిత్రంలో మాళవికా మోహనన్, పార్వతి తిరువొత్తు ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా.. పశుపతి, డానియెల్ కల్టగిరోన్ కీ రోల్స్ పోషిస్తున్నారు.

కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ (కేజీఎఫ్)లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ మూవీని స్టూడియో గ్రీన్, నీలమ్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై కేఈ జ్ఞానవేల్ రాజా తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. విక్రమ్ మరోవైపు గౌతమ్ వాసు దేవ్ మీనన్ డైరెక్షన్‌లో ధ్రువ నక్షత్రం: యుద్ధ కాండంలో నటిస్తున్నాడు. ఈ మూవీలో పెళ్లి చూపులు ఫేం రీతూవర్మ ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. మేకర్స్ ఇప్పటికే లాంఛ్ చేసిన ధ్రువ నక్షత్రం పోస్టర్లు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి.

# 250 కోట్ల పారితోషికం?

తమిళ అగ్ర కథానాయకుడు దళపతి విజయ్ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇవ్వడానికి సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన చివరి సినిమా సన్నాహాల్లో ఉన్నారు. విజయ్ 69వ మూవీగా తెరకెక్కబోతున్న ఈ సినిమాకు హెచ్. వినోద్ దర్శకత్వం వహించనున్నారు. డీవీవీ దానయ్య నిర్మాత. పొలిటికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమా విజయ్ రాజకీయ అరంగేట్రానికి ఊపునిచ్చే విధంగా ఉంటుందని ఆయన అభిమానులు అనుకుంటున్నారు. ఈ సినిమాలో విజయ్ యువ రాజకీయ నాయకుడి పాత్రలో కనిపిస్తారని తెలిసింది. ఇదిలావుండగా ఈ సినిమా కోసం విజయ్ తీసుకునే రెమ్యునరేషన్ గురించి తమిళ సినీ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ నడుస్తున్నది. విజయ్ చివర చిత్రం కావడంతో వసూళ్ల పరంగా ఈ సినిమా రికార్డు సృష్టించడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమాకు విజయ్ 250 కోట్ల భారీ రెమ్యునరేషన్‌ను తీసుకోబోతున్నారని సమాచారం. అదేగనుక నిజమైతే భారతీయ చిత్రసీమలో అత్యధిక పారితోషికం అందుకున్న హీరోగా విజయ్ చరిత్ర సృష్టించడం ఖాయమని అంటున్నారు. ప్రస్తుతం విజయ్ 'గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) సినిమాలో నటిస్తున్నారు. వెంకట్ ప్రభు దర్శకుడు. ఎయిర్‌ఫోర్స్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.





## సావిత్రితో ఉన్న అనుబంధాన్ని
# గుర్తుచేసుకుంటూ..

మహానటి సావిత్రి సినీ జీవితంపై వచ్చిన తాజా పుస్తకం 'సావిత్రి క్లాసిక్స్'. ఈ పుస్తకాన్ని ప్రముఖ రచయిత సంజయ్ కిశోర్ రచించగా.. సావిత్రి కూతురు విజయ చాముండేశ్వరి పబ్లిష్ చేసింది. ఇక ఈ బుక్ లాంచ్ వేడుక మంగళవారం హైదరాబాద్‌లో ఘనంగా జరుగగా.. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా మెగాస్టార్ చిరంజీవి హాజరయ్యి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సావిత్రితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ చిరు భావోద్వేగానికి లోనయ్యారు. మహానటి సావిత్రిపై రాసిన 'సావిత్రి క్లాసిక్స్' పుస్తకాన్ని ఆవిష్కరించడం నాకు చాలా ఆనందగా ఉంది. ఈ పుస్తక ఆవిష్కరణకు వారధిగా నిలబడడం నాకు దక్కిన అమూల్యమైన అవకాశంగా భావిస్తాను. ఈ కార్యక్రమం నా చేతుల మీదుగా జరగడం వలన నా జన్మ సార్ధకమైంది అని చిరంజీవి వెల్లడించారు. ఈ సందర్భంగా చిరు మాట్లాడుతూ.. సావిత్రి గురించి నాకు తెలిసింది చాలా తక్కువ. నాకు తల్లిలాంటి సావిత్రిగారి గురించి చెప్పడానికి ఉద్వేగంతో మాటలు రావడం లేదు. నా యాక్టింగ్ కోర్స్ పూర్తికాకుండానే నాకు 'పునాదిరాళ్లు' సినిమాలో హీరోగా ఛాన్స్ వచ్చింది. ఈ సినిమా షూటింగ్ వెళ్లేటప్పుడు నేను సావిత్రి గారితో కలిసి నటిస్తున్నానని నాకు తెలిసింది. ఆ విషయం తెలియాగానే నాకు షాక్ కొట్టినట్లు అనిపించింది. అయితే షూటింగ్ అనంతరం నన్ను సావిత్రి గారి వద్దకు తీసుకువెళ్లగా.. ఆవిడను చూడగానే నాకు మాట రాలేదు. ఈ మహానటినేనా ఇన్నాళ్లు నేను ఆరాధించేది అంటూ చిరు చెప్పుకొచ్చాడు. నన్ను చూసి 'నీ పేరేంటి బాబు'? అని అడిగింది. 'చిరంజీవి' అని చెప్పాను. ఆమె 'శుభం' అన్నారు. ఆ తర్వాత సినిమా షూటింగ్‌లో వర్షం పడగా డ్యాన్స్ చేస్తూ కింద పడ్డాను.. నేను వర్షంలో కూడా డ్యాన్స్ చేయడం ఆపలేదు. ఇది చూసిన సావిత్రి నా దగ్గరకు వచ్చి ఫ్యూచర్‌లో మంచి నటుడివి అవుతావు అంటూ మెచ్చుకుంది అంటూ చిరు చెప్పుకొచ్చాడు. కాగా దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది.

## దబాంగ్ భామ
# సోనాక్షిసిన్హా మెరుపులు..

బాలీవుడ్ నటుడు శత్రుఘ్నసిన్హా కూతురుగా దబాంగ్ సినిమాతో సిల్వర్ స్క్రీన్‌పై మెరిసింది సోనాక్షి సిన్హా. ఆ తర్వాత పలు హిట్ సినిమాల్లో నటించింది. రజినీకాంత్, సల్మాన్ ఖాన్, అక్షయ్‌కుమార్ లాంటి స్టార్ హీరోలతో నటించి.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ ప్రస్తుతం హీరామండి నెట్‌ఫ్లిక్స్ సిరీస్‌లో నటిస్తోంది. పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో సాగే కథతో వస్తోన్న ఈ ప్రాజెక్ట్‌ను పాపులర్ డైరెక్టర్ సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కిస్తున్నారు. కాగా ప్రమోషనల్ ఈవెంట్‌లో సోనాక్షిసిన్హా కర్లీ హెయిర్‌తో పర్పుల్ అవుట్‌ఫిట్‌లో మెరిసింది. హీరామండి నుంచి విడుదల చేసిన Tilasmi Bahein సాంగ్‌కు మంచి స్పందన వస్తోంది. సోనాక్షిసిన్హా ఫొటోలకు చిరునవ్వులు చిందిస్తూ ఫోజులివ్వగా.. అక్కడ ఉన్న కెమెరామెన్లు క్లిక్ మనిపించారు. దీనికి సంబంధించిన విజువల్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. సోనాక్షిసిన్హా ప్రస్తుతం బడే మియాన్ చోటే మియాన్ లో నటిస్తుండగా.. ఏప్రిల్ 10న విడుదల కానుంది. దీంతోపాటు మరో రెండు సినిమాల్లో నటిస్తోంది.

# కరువు కోరల్లో కరీంనగరం.....!



**కరీంనగర్ :** ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటాయి. సాగునీటి కాలువలు వట్టిపోయాయి. పంటపొలాలు నెర్రలు బారాయి. పంటలు ఎండుతున్నాయి. ఎండిన పంటపొలాలను చూసి దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు ఆవేదనతో ఆందోళన చెందుతున్నారు. ఎండిన పంటలను కాపాడుకునేందుకు రైతన్నలు అష్టకష్టాలు పడుతున్నారు. సాగునీటి కోసం భగీరథ ప్రయత్నం చేస్తున్నారు కొందరు బావుల్లో పూడిక తీస్తుండగా మరికొందరు ట్యాంకర్ ల ద్వారా పంటపొలాలకు నీటి సప్లై చేస్తున్నారు. నీటి వసతి లేని రైతులు ఎండిన పంటలను పశువులకు మేతగా మార్చుకుంటున్నారు. మరికొందరు కడుపు మండి నిప్పంటించి తగులబెడుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇప్పటికే వెలాది ఎకరాల్లో వరిపంట ఎండిపోయింది. సిరిసిల్ల, మానకొండూర్, కరీంనగర్, హుస్నాబాద్ నియోజకవర్గాలో పంటనష్టం తీవ్రత ఎక్కువగా ఉ ంది. ఎండిపోయిన పంటలకు ఎకరాన 30 వేల రూపాయల పరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు. లేకుంటే పెట్టిన పెట్టుబడి రాక అప్పులపాలై ఆత్మహత్యలే శరణ్యమని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేసిన రైతులను నీటి కష్టాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. చేతికందే దశలో ఉన్న వరిపంటకు చివరి తడికి నీళ్ళు లేక ఎండిపోయే పరిస్థితి ఏర్పడడంతో కరీంనగర్ మండలం ముగ్దుంపూర్ గ్రామానికి చెందిన రైతు పూరెల్ల అంజయ్య ట్యాంకర్ ద్వారా వరిపంటకు సాగునీరు అందిస్తున్నారు. వ్యవసాయ బావితోపాటు కెనాల్ నీటి వసతి ఆధారంగా తనకున్న మూడెకరాల భూమిలో ఎకరంన్నరలో వరిపంట సాగు చేశాడు. కాలువ నీళ్ళురాకపోవడంతో బావి నీళ్ళతో ఇంతకాలం పొలం పారింది. గత పదిరోజుల్లో భూగర్భ జలాలు పది నుంచి 15 మీటర్ల లోతుకు పడిపోవడంతో బావిలో నీళ్ళు పొలానికి సరిపోకపోవడంతో ట్యాంకర్ ద్వారా మొక్కకో చుక్క నీరు అన్నట్లు వాటర్ సప్లై చేసి ఎండుతున్న పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరో 15 రోజులైతే పంట చేతికందే దశలో ఉన్న పంటను కాపాడుకునేందుకు ఒక్కో ట్యాంకర్ కు వెయ్యి రూపాయల చొప్పున రోజుకు నాలుగు టాంకర్ ల వరకు తెప్పించి బావిలో పోయించి పంపుసెట్ ద్వారా పంటకు అందిస్తు ఆవేదనతో ఆందోళన చెందుతున్నాడు. ప్రభుత్వం ఎండుతున్న పంటకు జీ గంజిలా చివరి తడికోసం కాలువ నీళ్ళు ఇచ్చి ఆదుకోవాలని అంజయ్య కోరుతున్నాడు. రోజురోజుకు భూగర్భ జలాలు అడుగంటి సాగునీరు పంటల పొలాలు ఎండిపోవడంతో బిఆర్ఎస్ ఆందోళన వ్యక్తం చేస్తుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం సారంపల్లి లో ఎండిన పంటలను బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పరిశీలించారు. సాగునీరు లేక పంటలు ఎండి పుట్టెడు దుఃఖంతో ఉన్న రైతులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. కాలం తెచ్చిన కరువు కాదు...కాంగ్రెస్ తెచ్చిన కరువని ఆరోపించారు. పంటలు ఎండడానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని విమర్శించారు. రైతులను చూస్తే బాధేస్తుందన్నారు.

## బీజేపీపై కేసీఆర్ వ్యూహామా... మౌనమా....



తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఇచ్చిన షాక్ తర్వాత కేసీఆర్ పెద్దగా బయట కనిపించలేదు. ఓడిపోయిన తర్వాత సంఘిభావంగా పలువురు నేతలు, కార్యకర్తలు ఫామ్‌హౌస్‌కు వస్తున్న సందర్భంలో ఆయన బాత్ రూంలో జారి పడటంతో విశ్రాంతికి పరిమితమయ్యారు. తర్వాత నల్లగొండలో బహిరంగసభ.. మళ్లీ నల్లగొండ జిల్లాలోనే రైతుల పరామర్శ యాత్ర చేసారు. రెండు సందర్భాలు పరోక్షంగా అయినా ఎన్నికల కోణంలో నిర్వహించిన పర్యటనలే. అయితే రెండు సందర్భాల్లోనూ కేసీఆర్ బీజేపీ గురించి ఒక్క మాట మాట్లాడలేదు. విమర్శించలేదు. ఈ రెండు సందర్భాల్లోనే కాదు.. కీలకమైన పరిణామాలు జరిగినప్పుడు కూడా.. అంటే కుమార్తెను అరెస్టు చేసిన అంశంపైనా ఆయన స్పందించలేదు. కేసీఆర్ వ్యవసాయం, రైతుల సమస్యలు అజెండాగా మార్చుకుని లోక్ సభ ఎన్నికల కోసం బయటకు వచ్చారు. గతంలో ఎన్నడూ లేనంత క్లిష్టమైన రాజకీయ సవాళ్లను కేసీఆర్ ఎదుర్కొంటున్నారు. కానీ ఆయనకు ఎన్నో పరిమితులు ఉన్నాయి. వాటి మధ్యే ఆయన రాజకీయం చేస్తున్నారు. కవితను బీజేపీలోకి రావాలని బెదిరించారని లేకపోతే కేసులు, అరెస్టులు తప్పవని బీజేపీ బెదిరించిందని 2022 నవంబర్‌లో పార్టీ కార్యవర్గ సమావేశంలో కేసీఆర్ వ్యాఖ్యలు చేశారు. కవితపై ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఆరోపణలు వచ్చిన తర్వాత కేసీఆర్ బహిరంగంగా స్పందించింది చాలా తక్కువ. అయితే అప్పట్లో కార్యవర్గ సమావేశంలో మాత్రం కవిత అంశాన్ని ప్రస్తావించారు. ఈడీ దాడులు చేసిన తర్వాత కవితను బీజేపీలోకి రావాలని ఒత్తిడి చేసినట్లుగా కేసీఆర్ చెప్పారు. బీజేపీతో ఇక యుద్ధమే ఉంటుందని.. అప్పట్లో స్పష్టం చేశారు. కవితపైనే కాదు పార్టీ నేతలపైనా దర్యాప్తు సంస్థలు విరుచుకుపడతాయని అయినా ఆందోళన చెందవద్దని చెప్పారు. దాదాపుగా ఏడాదిన్నర తర్వాత చూస్తే కేసీఆర్ బీజేపీతో యుద్ధం కాదు కదా కవితను అరెస్టు చేసినా మౌనాన్నే ఆశ్రయిస్తున్నారు. బీజేపీని ఒక్క మాట అనడం లేదు. కవితను అరెస్టు చేసిన రోజున కేటీఆర్ బీజేపీ దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు కానీ కేసీఆర్ మాత్రం ఒక్క విమర్శ కూడా చేయలేదు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. ఇప్పుడు లోక్ సభ ఎన్నికలు జరుగుతున్నాయి. కేంద్రంలో బీజేపీ ఉండాలా.. ఇండియా కూటమి ఉండాలా అన్న అంశం ప్రాతిపదికగా ఓటింగ్ జరుగుతుంది. అంటే కేంద్రం అంశాలు హైలెట్ అవ్వాలి. అయితే కేసీఆర్ పూర్తిగా రాష్ట్రంలో ఉన్న కరువుకు కాంగ్రెస్‌ను బాధ్యురాల్ని చేసి బీఆర్ఎస్ కు ఓట్లేయించుకోవాలన్న వ్యూహం పాటిస్తున్నారు. పూర్తిగా బీజేపీ విషయంలో ఆయన వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నారు. సీఏఏను అమల్లోకి తెచ్చినా బీఆర్ఎస్ స్పందించలేదు. నిజానికి సీఏఏ అంశం బీఆర్ఎస్‌కు కీలకం. ముస్లిం వర్గాల మద్దతు కూడగట్టుకోవడానికి ఈ అంశంపై బీజేపీపై తీవ్రంగా విరుచుకుపడే అవకాశం ఉండేది. కానీ కేసీఆర్ వదలుకున్నారు. బీజేపీ జోలికి వెళ్లాలని అనుకోవడం లేదు. పూర్తిగా కాంగ్రెస్ పార్టీనే టార్గెట్ చేస్తున్నారు. కేసీఆర్ తీరు పెద్దగా ఎవరికీ ఆశ్చర్యం కలిగించడం లేదు. ఎందుకంటే బీజేపీని విమర్శించడాన్ని ఆయన ఎన్నికల కంటే ముందే ఆపేశారు. రాబోయే ప్రమాదాన్ని ఆయన ముందుగానే ఊహించారు. కానీ ప్రమాదం మాత్రం ఆగలేదని తాజా పరిణామాలతో నిరూపితమవుతోంది. నిజానికి బీజేపీ ఇప్పుడు తెలంగాణలో.. బీఆర్ఎస్‌కు ముప్పుగా మారింది. ప్రతిపక్ష స్థానాన్ని కైవసం చేసుకునేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తోంది. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి బీఆర్ఎస్ కన్నా ఎక్కువ సీట్లు.. ఎక్కువ ఓట్లు వస్తే ఆ తర్వాత జరగబోయే రాజకీయ పరిణామాలను అంచనా వేయడం కేసీఆర్ వల్ల కూడా కాదు.

# వీగిపోయిన అవిశ్వాసం.....

సంస్థాన్ నారాయణపురం, ఏప్రిల్ 2 : ఎం పీపీ గుత్తా ఉమాదేవిపై బీఆర్ఎస్ ఎంపీటీసీల అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. సోమవారం మండ ల పరిషత్ కార్యాలయంలో ఆర్డీవో శేఖర్‌రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పూర్తిస్థాయిలో కోరం లేకపోవడంతో అవిశ్వాసం వీగిపోయినట్లు ఆర్డీవో ప్రకటించారు. నారాయణపురం మండలంలో మొత్తం 13మంది ఎంపీటీలు ఉ ండగా గుజ్జ గ్రామానికి చెం దిన సీపీఎం ఎం పీటీసీ ఇటీవల మృతి చెందాడు. దీంతో 12 మంది ఎంపీటీసీలు ఉన్నారు. ఇందులో బీఆర్ఎసకు చెందిన వారు తొమ్మిది, కాంగ్రెస్, సీపీఐ, సీపీఐలకు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు. అయితే మండల పరిషత్ కార్యాలయంలో ఆర్డీవో శేఖర్‌రెడ్డి అధ్యక్షతన అవిశ్వాసనోటీసుపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీఆర్ఎసకు ఎనిమిది ఎంపీటీసీలు మాత్రమే హాజరయ్యారు. బీఆర్ఎసతో పాటు కాంగ్రెస్, సీపీఐ, సీపీఎంలకు చెందిన ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. అవిశ్వాసం నెగ్గాలంటే 9 మంది ఎంపీటీసీలు ఉండాలని,బీఆర్ఎసకి చెందిన ఎనిమిది మంది మాత్రమే హాజరు కావడంతో పూర్తిస్థాయిలో కోరం లేకపోవడంతో అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు ఆర్డీవో శేఖర్‌రెడ్డి ప్రకటించారు. దీంతో అధికా ర కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీపీపై ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎంపీటీసీలు పెట్టినఅవిశ్వాసం వీగిపోవడం తో అధికార పార్టీకి చెందిన ఎంపీపీ ఉమాదేవి తన పంతం నెగ్గించుకున్నట్లయింది. అవిశ్వాసం వీగిపోవడంతో ఎంపీపీగా యథావిధిగా



కొనసాగనున్నారు. చట్టాన్ని తుంగలో తొక్కి నిబంధనలకు విరుద్ధం గా ఆర్డీవో శేఖర్‌రెడ్డి అధికార పార్టీకి కొమ్ముకాశారని ఆరోపిస్తూ బీఆర్ఎసకు చెందిన ఎంపీటీసీలు మండ ల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ని బంధన ప్రకారం తమకు పూర్తి మెజార్టీ ఉన్నా కావాలని అధికార పార్టీకి చెందిన ఎంపీపీకి అనుకూలంగా వ్యవహరించారని విమర్శించారు. ఆర్డీవో వాహనాన్ని ముందుకు వెళ్లకుండా అడ్డుతగిలారు. చనిపోయిన ఎంపీటీసీని కూడా ఎలా పరిగనలోకి తీసుకుంటారంటూ నిలదీశారు. ఆందోళనలతో కాసేపు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పోలీసులు బీఆర్ఎస్ నాయకులను తప్పించి ఆర్డీవో వాహనాన్ని పంపించి వేశారు. అనంతరం ఇదే విషయమై ఎం పీడీవో ప్రమోద్‌కుమార్‌తో బీఆర్ఎస్ ఎంపీటీసీలు కొంతసేపు వాగ్వాదం చేశారు. అధికారులు, పోలీసులు సర్దిచెప్పడంతో ఆందోళన సద్దుమణిగింది. చిల్లాపురం గ్రామ బీఆర్ఎస్ ఎంపీటీసీ కరంటోతు విజయదశరథను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తుల లక్ష్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ ఉమాదేవిపై అవిశ్వాస సమయంలో పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించారని ఆయన పేర్కొన్నారు.

# తల్లిదండ్రులపై గ్యాంగ్ వార్....!

హైదరాబాద్, ఏప్రిల్ 2 : రంగారెడ్డి జిల్లా నార్సింగిలో దారుణం జరిగింది. తమ కూతురితో అసభ్యంగా ప్రవర్తించిన యువకున్ని ప్రశ్నించిన తల్లిదండ్రులపై ఓ గ్యాంగ్ దాడికి పాల్పడింది. ఈ క్రమంలో ఆ గ్యాంగ్ లోని ఓ నిందితుడు యువతి తండ్రి గొంతు కోశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెమలినగర్ లో ఓ యువతి దుకాణానికి వెళ్లగా.. సురేష్ అనే యువకుడు ఆమెతో అనభ్యంగా ప్రవర్తించాడు. హోలీ రోజు తప్పించుకున్నావంటూ.. ఆమెపై నీళ్లు పోశాడు. అతడి నుంచి ఎలాగోలా తప్పించుకున్న యువతి ఏడుస్తూ ఇంటికి వెళ్లి విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో ప్రశ్నించేందుకు వెళ్లిన తల్లిదండ్రులపై సురేశ్ గ్యాంగ్ దాడికి పాల్పడింది. అనంతరం సురేష్ స్నేహితుడు కత్తితో యువతి తండ్రి గొంతు కోశాడు. అడ్డువచ్చిన యువతి తల్లిపైనా దాడికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దీనిపై కేసు నమోదు చేశారు. సురేష్ తో పాటు అతని గ్యాంగ్ ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. నిందితుల నుంచి 4 కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. అటు, ఆస్తి తగాదాల విషయంలో ఓ కొడుకు కన్న తండ్రి గొంతు కోశాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా కోట్పల్లి మండలం బీరెల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అనంతయ్య అనే వ్యక్తి చాలాకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు.

# తొమ్మిన్నరేండ్ల కేసీఆర్ పాలనలో ఒక్క ఎకరం కూడ ఎండలే

## -మాజీ మంత్రి, ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



**మంథని :** తొమ్మిన్నరేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో ఎక్కడా ఒక్క ఎకరం ఎండలేదని మాజీ మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంగళవారం మంథని మున్సిపల్ పరిధిలోని పోచమ్మవాడ సమీపంలో ఎండిన పంటపొలాలను జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఎండిన పంటలను చూపిస్తూ కన్నీరు పెట్టుకున్న రైతులను వారు ఓదార్చారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అదికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో పాలకులు నీళ్లిస్తామని భరోసా ఇవ్వడం మూలంగానే రైతులు పంటలు సాగుచేసుకున్నారని, పంటలు సాగుచేసుకున్న తర్వాత నీళ్లివ్వక పోవడంతో నష్టపోయారని ఆయన అన్నారు. తమ ప్రభుత్వం అదికారంలో ఉన్నప్పుడు వర్షాబావం ఏర్పడి నీళ్లు లేని పరిస్థితుల్లో నీళ్లు ఇవ్వలేమని ముందుగానే రైతులకు చెప్పామని, దాంతో రైతులు కూడా పంట సాగుకు ముందుకు రాలేదన్నారు. రైతుల పట్ల ముందుచూపు లేని కాంగ్రెస్ ప్రభుత్వం మూడు మాసాల్లో రైతులకు కన్నీరు మిగిల్చిందని ఆయన అన్నారు. సాగునీరు అందక పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతే పరామర్శించి ఆదుకుంటామని భరోసా ఇవ్వాల్సింది పోయి గత ప్రభుత్వం, పాలకులపై నిందలు వేయడం, విమర్శలు చేయడం విడ్డూరంగాఉందన్నారు. అకాల వర్షాలతో పంట నష్టం జరిగితే ఆనాడు తమ ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకుందనే విషయాన్ని కాంగ్రెస్ పాలకులు గుర్తించాలన్నారు. ఎండిన పంట ఎకరాకు రూ. 25వేల చొప్పున అందించి ఆదుకోవాలని, అలాగే పంట మద్దతు ధర రూ. 500 బోనస్‌పై వెంటనే ప్రకటన చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉండి ప్రతిపక్ష పాత్ర పోషిస్తే రాజకీయాలు చేస్తున్నారని మాట్లాడటం విడ్డూరంగా ఉందని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. మంథని పట్టణంలోని పోచమ్మవాడ సమీపంలో బిరుదు మల్లయ్య,శ్రీనివాస్‌ల ఎండిపోయిన పంట పొలాలను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లయ్య, శ్రీనివాస్‌లు 14ఎకరాల్లో పంట సాగు చేశారని, నెల రోజులుగా నీళ్లు రాకపోవడంతో పంట పూర్తిగా చేతికి రాకుండా పోయిందని, అప్పులు, ఆస్తులు అమ్ముకుని పంటలు వేసుకుంటే కాంగ్రెస్ పాలకుల అసమర్థతతో ఆగమై పోయారని ఆయన వాపోయారు. గత ప్రభుత్వంలో ఏనాడైనా ముఖ్యమంత్రి రైతులను పట్టించుకున్నాడా అని విమర్శలు చేస్తున్నారని, ప్రజల ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ పెద్దలు ఏనాడైనా రైతులను పరామర్శించి భరోసా ఇచ్చారా అని ఆయన ప్రశ్నించారు. అంతేకాకుండా గత ఏడాదిలో అకాల వర్షాలతో పంట నష్ట జరిగితే ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకుందని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వ అసమర్థతను కప్పి పుచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారే కానీ రైతులకు మనోధైర్యం కల్పించాలనే ఆలోచన చేయడం లేదని ఆయన విమర్శించారు. ఎండిన పంటలకు నష్టపరిహారంతో పాటు మిగిలిన పంటలను కాపాడాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నేతృత్వంలో రైతులతో కలిసి 36గంటల నిరసన దీక్ష చేపట్టితే జిల్లాలో ఎండిన పంటలను పరిశీలించి రైతులకు భరోసా కల్పించాల్సిన పాలకులు జిల్లా కేంద్రంలో కూర్చుండి అధికారంలో లేని వాళ్లపై అబండాలు వేస్తున్నారని అన్నారు. గత సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో వర్షాలు కురియలేదని మంత్రి మాట్లాడటం విడ్డూరంగా ఉందని, గత రెండు మాసాల్లో రికార్డు స్థాయిలో వర్షాలు కురిసినట్లు రికార్డులు ఉన్నాయని, రెండు మాసాల్లో సాధారణ వర్షాపాతం 177.5 ఉండాల్సి ఉండగా 251.9శాతం అత్యధికంగా వర్షాపాతం నమోదు అయిందన్నారు. పంటలకు సాగునీరు అందించలేక నీళ్లు లేవని, వర్షాలు కురియలేదని సాకులు చెబుతున్నారని ఆయన దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో ఏనాడైనా ముఖ్యమంత్రి రైతులను పట్టించుకున్నాడా అని విమర్శలు చేస్తున్నారని, ప్రజల ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ పెద్దలు ఏనాడైనా రైతులను పరామర్శించి భరోసా ఇచ్చారా అని ఆయన ప్రశ్నించారు. అంతేకాకుండా గత ఏడాదిలో అకాల వర్షాలతో పంట నష్ట జరిగితే ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకుందని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వ అసమర్థతను కప్పి పుచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారే కానీ రైతులకు మనోధైర్యం కల్పించాలనే ఆలోచన చేయడం లేదని ఆయన విమర్శించారు.

గరుడ వార్త


## ఏడాది క్రితం రూ.17వేల కోట్లకు అధిపతి.. ఇప్పుడు జీరో..

# బైజూస్ రవీంద్రన్ పరిస్థితి ఇదీ..!

న్యూఢిల్లీ: ఒకప్పుడు ప్రపంచంలోనే మోస్ట్ వాల్యూడ్ ఎడ్‌టెక్ కంపెనీగా ఉన్న బైజూస్ ఇప్పుడు పీకల్లోతు ఆర్థిక కష్టాల్లో కొట్టుమిట్టాడుతోంది. తీవ్ర ద్రవ్య కొరతను ఎదుర్కొంటోంది. సంస్థలోని ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితి. ఒకానొక సమయంలో ఉద్యోగులకు జీతాలు చెల్లించేందుకు తాను ఎంతో ఇష్టంగా కట్టుకున్న ఇంటిని కూడా తాకట్టు పెట్టేందుకు బైజూస్ రవీంద్రన్ సిద్ధపడ్డాడు. అంతేకాదు విలువైన ఆస్తులనుకూడా అమ్ముకున్నట్లు తెలిసింది.



అయితే, గతేడాది ఇదే సమయానికి ఆయన వేల కోట్లకు అధిపతిగా ఉన్నారు. రూ.17వేల కోట్ల నెట్ వర్త్‌తో ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా పేరు గడించాడు. ప్రపంచ కుబేరుల జాబితా ఫోర్బ్స్‌లో స్థానం సంపాదించుకున్నాడు. అయితే ఒక్క ఏడాదిలో అంతా తారుమారైపోయింది. వేల కోట్లకు అధిపతి నుంచి చేతిలో రూపాయి కూడా లేని దుస్థికి చేరడం గమనార్హం. తాజా ఫోర్బ్స్ జాబితాలో రవీంద్రన్ నికర విలువ ఏకంగా సున్నాకి పడిపోయింది.

2011 లో రవీంద్రన్ ఎడ్యుకేషన్ స్టార్టప్ బైజూస్‌ను స్థాపించిన విషయం తెలిసిందే. ఆన్ లైన్‌లో పాఠాలు బోధించే ఈ స్టార్టప్‌కు తొలినాళ్లలో ఆదరణ అంతంత మాత్రంగానే ఉండేది. అయితే, కరోనా కాలంలో ఈ సంస్థకు దశ తిరిగింది. దేశవ్యాప్తంగా లాక్ డౌన్ విధించడంతో బైజూస్ వాల్యూ ఒక్కసారిగా పెరిగింది. 2022లో ఏకంగా 22 బిలియన్ డాలర్లకు చేరింది. దీంతో రవీంద్రన్ ప్రపంచ కుబేరుడిగా అవతరించాడు.

అయితే, కంపెనీ అనుసరించిన విధానాలు, సీఈవోగా రవీంద్రన్ తీసుకున్న నిర్ణయాలు బెడిసికొట్టి కంపెనీని నష్టాల్లోకి నెట్టాయి. ఎంత వేగంతో పైకి ఎదిగిందో.. అదే వేగంతో ఒక్కసారిగా బైజూస్ విలువ కుప్పకూలిపోయింది. వేల కోట్లకు అధిపతి అయిన ఆయన ఏడాది కూడా తిరగకముందే జీరోకు పడిపోవడం గమనార్హం. 2024-ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితాను బుధవారం విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ జాబితాలో బైజూస్ అధినేత రవీంద్రన్ తో పాటు మరో ముగ్గురు ప్రపంచ కుబేరుల స్థానం నుంచి చోటు కోల్పోయినట్లు ఫోర్బ్స్ తెలిపింది. 2022లో 22 బిలియన్ డాలర్ల నెట్ వర్త్‌తో ఉన్న బైజూస్ సీఈవో.. ఈ ఏడాది 1 బిలియన్ కన్నా తక్కువకు పడిపోయిందని ఫోర్బ్స్ తన రిపోర్టులో వెల్లడించింది.

**ఫోర్బ్స్ జాబితా ప్రకారం.. భారత్ అగ్రశ్రేణి బిలియనీర్లు వీరే**

ముకేశ్ అంబానీ - 116 బిలియన్ డాలర్లు
గౌతం అదానీ - 84 బిలియన్ డాలర్లు
శివ నాడార్ - 36.9 బిలియన్ డాలర్లు
సావిత్రి జిందాల్ - 33.5 బిలియన్ డాలర్లు
దిలిప్ షాంఘ్వి - 26.7 బిలియన్ డాలర్లు
సైరస్ పూనావాలా - 21.3 బిలియన్ డాలర్లు
కుషాల్ పాల్ సింగ్ - 20.9 బిలియన్ డాలర్లు
కుమార్ బిర్లా - 19.7 బిలియన్ డాలర్లు
రాధాకిషన్ దమానీ - 17.6 బిలియన్ డాలర్లు
లక్ష్మీ మిట్టల్ - 16.4 బిలియన్ డాలర్లు

# సొంత ఇల్లు, కారు లేని రాహుల్ గాంధీ ఆస్తి ఎంతో తెలుసా?



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి రూ. 20 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. అయితే ఆయనకు సొంత ఇల్లు కాని, సొంత కారు కాని లేవు. కేరళలోని వయనాడ్ నుంచి లోక్‌సభ ఎన్నికల బరిలో మరోసారి దిగుతున్న రాహుల్ గాంధీ తన ఎన్నికల అఫిడవిట్‌లో ప్రకటించిన ఆస్తులివి. రాహుల్‌కు రూ. 9.24 కోట్ల చరాస్తులు ఉన్నాయి. అందులో రూ. 55,000 నగదు, రూ. 26.25 లక్షల బ్యాంకు డిపాజిట్లు, రూ.4.32 కోట్ల బాండ్లు, షేర్లు, రూ.3.81 కోట్ల మ్యూచువల్ ఫండ్స్, రూ.15.21 లక్షల గోల్డ్ బాండ్లు, రూ.4.20 లక్షల నగలు ఉన్నాయి. కాంగ్రెస్ అగ్రనేతకు రూ. 11.15 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. ఇందులో తన సోదరి ప్రియాంక గాంధీతో కలసి ఢిల్లీలోని మెహ్రౌలిలో వ్యవసాయ భూమి ఉంది. గురుగ్రామ్‌లో రూ.9 కోట్ల విలువచేసే ఆఫీస్ స్పేస్ కూడా ఆయనకు ఉంది. వ్యవసాయ భూమిని వారసత్వంగా వచ్చిన ఆస్తిగా పేర్కొన్న ఆయన ఆఫీస్ స్పేస్ గురించి వెల్లడించలేదు. తనపైన నమోదైన పోలీసు కేసుల గురించి కూడా ఆయన వివరంగా ప్రస్తావించారు. వీటిలో ఒక పోక్సో కేసు కుంది ఉంది. అత్యాచార బాధితురాలి కుటుంబ సభ్యుల వివరాలను ఒక సోషల్ మీడియా పోస్టులో వెల్లడించినందుకు ఆయనపై పోక్సో కేసు నమోదైంది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు ఎఫ్‌ఐఆర్‌ను సీల్డ్ కవర్‌లో పోలీసులు అందచేశారని, అందులోని వివరాలు తనకు తెలియవని, తనను నిందితుడిగా చేర్చారా లేదా అన్న విషయాలు తనకు తెలియనప్పటికీ ముందు జాగ్రత్తగా ఆ కేసును కూడా ప్రస్తావించానని రాహుల్ తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. బిజెపి నాయకులు దాఖలు చేసిన పరువునష్టం కేసులను కూడా రాహుల్ ప్రస్తావించారు. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్‌కు సబంధించిన నేరపూరిత కుట్ర కేసును కూడా రాహుల్ తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికలలో వయనాడ్ సీటును గెలుచుకున్న రాహుల్ గాంధీ 2024 ఎనిష్టిపిఐ నాయకుడు అన్నీ రాజా, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కె సురేంద్రన్‌తో తలపడుతున్నారు.

# మృత్యుంజయుడు ఆ రెండేళ్ల బాలుడు




విజయపుర (కర్నాటక): బోరు బావిలో పడిపోయిన ఒక రెండేళ్ల బాలుడిని సహాయక సిబ్బంది 20 గంటలపాటు శ్రమించి సురక్షితంగా వెలుపలికి తీశారు. మృత్యుంజయుడిగా విజయపుర జిల్లాలోని ఇండి తాలూకాకు చెందిన లచ్యన గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠను కలిగించింది. సాత్విక్ సతీష్ ముజగోండ్ అనే రెండేళ్ల బాలుడు బుధవారం సాయంత్రం తెరచి ఉన్న బోరుబావిలో పడిపోయాడు. 16 అడుగుల లోతున బాలుడు చిక్కుకుని ఉన్నట్లు గుర్తించిన సహాయక సిబ్బంది బుధవారం సాయంత్రం నుంచి సహాయ కార్యక్రమాలు ప్రారంభించారు. ఆ బోరు బావికి సమాంతరంగా సొరంగాన్ని తవ్వి బాలుడిని 16 అడుగుల లోతు నుంచి రక్షించారు. ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్, అగ్నిమాపక, అత్యవసర సర్వీసుల శాఖ సిబ్బంది సంయుక్తంగా ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నంత సేపు బాలుడి ఏడుపు లోపలి నుంచి వినిపిస్తూనే ఉంది. బోరు బావి నుంచి వెలుపలికి తీసిన వెంటనే ఆ బాలుడిని అక్కడే నిలిపి ఉన్న అంబులెన్సులోకి తరలించి వైద్య బృందం చేత పరీక్షలు చేయించారు. బాలుడి శరీరంపై ఎటువంటి గాయాలు కనిపించలేదని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ఇండిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం బాలుడిని జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. ఆ బాలుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వారు తెలిపారు. బోరు బావిలో పడిన బాలుడు సురక్షితంగా బయటపడడం పట్ల ముఖ్యమంత్రి సిద్దరామయ్య సంతోషం వ్యక్తం చేశారు. ఆ బాలుడిని సురక్షితంగా వెలుపలికి తీయడ కోసం శ్రమించిన సహాయక సిబ్బందిని ఆయన అభినందించారు. తమ కుమారుడిని కాపాడిన సహాయక సిబ్బందికి ఆ బాలుడి తల్లిద్రంపలు కృతజ్ఞతలు తెలిపారు. ఖాళీగా వదిలేసిన ఆ బోరు బావిని మంగళవారం నాడే ఎవరో తవ్వి వదిలేశారు.


# పవన్ కళ్యాణ్ ఎందుకు పార్టీ పెట్టిండో.. షర్మిల ఎందుకు పోటీ చేస్తుందో..! : సజ్జల



అమరావతి: చంద్రబాబు స్వార్థంతో ఏం చేస్తున్నారో అర్థం కావడంలేదని ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆ స్వార్థంతోనే వాలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు కుట్రలు చేశారని మండిపడ్డారు. వాలంటీర్లపై నిమ్మగడ్డ రమేశ్‌తో ఫిర్యాదు చేయించారని పేర్కొన్నారు. వాలంటీర్లను తప్పించాలని లేఖ ఇప్పించింది ఆయనే అని పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం మీడియాతో మాట్లాడుతూ.. వాలంటీర్ల వ్యవస్థపై కుట్రతో చంద్రబాబుపై ప్రజల్లో వ్యతిరేకత ఇంకా పెరిగిపోయిందని విమర్శించారు.

పెన్షన్ల విషయంలో తమపై ప్రజాగ్రహం వస్తుందని టీడీపీ గుర్తించిందని.. కానీ చంద్రబాబు ఎంత సంజాయిషీ ఇచ్చినా జనం నమ్మరని సజ్జల విమర్శించారు. గతంలో ఒకటో తేదీన వాలంటీర్ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో 80 శాతం పెన్షన్ పంపిణీ పూర్తయ్యేదని.. కానీ ఇప్పటివరకు 60 శాతం పెన్షన్ల పంపిణీ మాత్రమే జరిగిందని చెప్పారు. పైగా స్వయంగా వెళ్లి తెచ్చుకోవాల్సి రావడంతో వృద్ధులు, దివ్యాంగులు కష్టపడుతున్నారని తెలిపారు. ఈ విషయంలో చంద్రబాబుపై ప్రజల్లో వ్యతిరేకత రావడంతో వాలంటీర్లకు మద్దతుగా మాట్లాడుతున్నారని చెప్పారు. చంద్రబాబుకు సమాజంలో ఉండే అర్హత లేదని విమర్శించారు. ఈసీపై ఒత్తిడి తీసుకొచ్చి పెన్షన్లు అడ్డుకున్నారని తెలిపారు. ప్రధాని సభ వైఫల్యాన్ని చంద్రబాబు, దగ్గుబాటి పురంధేశ్వరి రాష్ట్ర పోలీసులపై రుద్దే ప్రయత్నం చేశారని సజ్జల అన్నారు. 20 మంది ఎస్పీలపై పురంధేశ్వరి ఫిర్యాదు చేయడం దారుణమని అన్నారు. పవన్ పార్టీ ఎందుకు పార్టీ పెట్టారో అర్థం కావడం లేదు.. ఎన్నికల ముందే కూటమి దివాలీ తీసిందని విమర్శించారు. షర్మిల తెలంగాణలో ఎందుకు పార్టీ పెట్టారో తెలియదు.. ఏపీకి వచ్చి ఎందుకు పోటీ చేస్తున్నారో తెలియదు

# ఎస్ఏ-2 పరీక్షలు వాయిదా.. ప్రకటించిన తెలంగాణ విద్యాశాఖ



హైదరాబాద్ : ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు నిర్వహించే ఎస్ఏ-2 పరీక్షలకు సంబంధించి ప్రభుత్వం కీలక అప్డేట్ ఇచ్చింది. ఈ పరీక్షలను ఏప్రిల్ 15వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. ఏప్రిల్ 15 నుంచి 22వ తేదీ వరకు ఎస్ఏ-2 పరీక్షలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 23వ తేదీన ఫలితాలు ప్రకటించి, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం స్కూళ్లకు వేసవి సెలవులు ప్రకటించనున్నారు. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు ఉదయం 9 గంటల నుంచి 11:30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. 8వ తరగతికి ఉదయం 9 నుంచి 11:45 గంటల వరకు, 9వ తరగతికి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఎస్ఏ-2 పరీక్షల వాయిదాను డీఈవోలు, స్కూళ్ల ప్రిన్సిపల్స్, విద్యార్థులు గమనించాలని అధికారులు సూచించారు.

# తొట్టతొలి దేశీయ క్యాన్సర్ థెరపీ




న్యూఢిల్లీ: దేశంలో తొలిసారిగా రూపొందిన క్యాన్సర్ చికిత్స కార్ టి సెల్ థెరపీని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మూ గురువారం అధికారికంగా మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్యాన్సర్‌కు వ్యతిరేకంగా జరిగే పోరులో , మానవాళికి సరికొత్త ఆశను నమ్మికను కల్పించే క్రమంలో ఇదో మైలురాయి అవుతుందని తెలిపారు. ఇక్కడి పొవాయ్‌లోని ఐఐటి బొంబాయిలో ఈ థెరపీ విడుదల కార్యక్రమం జరిగింది. మేకిన్ ఇండియా ఉద్యమస్ఫూర్తికి ఈ థెరపీ ఓ ప్రతీక అవుతుందని రాష్ట్రపతి తెలిపారు. ఐఐటి బొంబాయి, టాటా మెమొరియల్ సెంటర్ కలిసి ఈ జన్యు ప్రాతిపదిక థెరపీని రూపొందించాయి. క్యాన్సర్ చికిత్స ప్రక్రియలో ఇది తక్కువ వ్యయ ప్రక్రియ కూడా అవుతుంది. యావత్తూ మానవాళికి ఈ ఔషధ చికిత్స ప్రక్రియ మేలు చేస్తుందని రాష్ట్రపతి తెలిపారు. కార్యక్రమంలో టాటా సంస్థ డైరెక్టర్ సుదీప్ గుప్తా, ఐఐటి బొంబాయి డైరెక్టర్ ప్రొఫెసర్ సుభాసిస్ చౌదరి కూడా మాట్లాడారు. అయితే ఈ థెరపీ దేశంలో అందరికీ అందుబాటు ధరల్లో లభ్యం కావడం అనేది ఇప్పట్లో సాధ్యం కాదని దీని నిర్మాతలు తెలిపారు. కోట్ల రూపాయలలో దీనిని పొందేందుకు వీలుంటుంది. అయితే క్రమేపీ ధరలను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటే ఇది క్యాన్సర్ చికిత్సలో కీలకం అవుతుంది.

# విష సర్పాన్నయినా నమ్మవచ్చు కాని బిజెపిని నమ్మలేము



న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఎన్నికల నియమావళిని బిజెపి పాటించడం లేదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. విష సర్పాన్ని అయినా నమ్మవచ్చు కాని బిజెపిని నమ్మలేమని ఆమె వ్యాఖ్యానించారు. గురువారం కూచ్‌ఇ బిహార్‌లో ఒక ఎన్నికల సభలో ఆమె ప్రసంగిస్తూ కేంద్ర దర్యాప్తు సంస్థలు, బిఎస్‌ఎఫ్, సిఐఎస్‌ఎఫ్ బిజెపి చేతిలో కీలుబొమ్మలుగా మారాయని ఆరోపించారు. అందరికీ సమాన అవకాశాలు లభించేలా చూడాలని ఆమె ఎన్నికల సంఘాన్ని కోరారు. విష సర్పాన్నయినా మీరు నమ్మవచ్చు. కావాలంటే దాన్ని పెంచుకోవచ్చు..కాని బిజెపిని ఎన్నటికీ నమ్మలేరు.. బిజెపి దేశాన్ని నాశనం చేస్తోంది అంటూ మమత మండిపడ్డారు. కేంద్ర దర్యాప్తు సంస్థల బెదిరింపులకు టిఎంసి బెదిరేది లేదని ఆమె స్పష్టం చేశారు. స్థానికులను బిఎస్‌ఎఫ్ వేధిస్తే పోలీసు కేసులు నమోదు చేయాలని ఆమె కూచ్ బిహార్‌లోని మహిళలకు పిలుపునిచ్చారు. ఏప్రిల్ 19న ఇక్కడ లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరగనున్నది. కేంద్ర దర్యాప్తు సంస్థలు, ఎన్‌ఐఎ, ఆదాయం పన్ను శాఖ, బిఎస్‌ఎఫ్, సిఐఎస్‌ఎఫ్ వంటివన్నీ బిజెపి కోసం పనిచేస్తున్నాయని ఆమె ఆరోపించారు. ఒక దేశం, ఒకే పార్టీ అన్న సిద్ధాంతాన్ని బిజెపి పాటిస్తోందని ఆమె విమర్శించారు.

# సుప్రీం కోర్టులో అమరావతి ఎంపీ నవనీత్ కౌర్‌కు భారీ ఊరట



న్యూఢిల్లీ: మహారాష్ట్రలోని అమరావతి నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీ, సినీనటి నవనీత్ కౌర్‌కు సుప్రీం కోర్టులో భారీ ఊరట లభించింది. క్యాస్ట్ సర్టిఫికెట్ పై నవనీత్ కౌర్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. నవనీత్ కౌర్ ఎస్సీ కాదంటూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును అత్యున్నత న్యాయస్థానం కొట్టేసింది. నవనీత్ కౌర్ 2019 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన విషయం తెలిసిందే. శివసేన అభ్యర్థి ఆనందరావుపై విజయం సాధించారు. అయితే ఆమె నకిలీ పత్రాలతో ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం పొందారని శివసేన మాజీ ఎంపీ ఆనందరావు ఆరోపించారు. ఈ మేరకు బాంబే హైకోర్టులో దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిగింది. కౌర్ కుల ధ్రువీకరణ పత్రం అబద్ధమని బాంబై హైకోర్టు గుర్తించి, దాన్నిరద్దు చేయడంతోపాటు రూ. 2 లక్షల జరిమానా విధించింది.

# కలెక్టర్ సీరియస్...

హైదరాబాద్ : నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్ కాలనీలో తాగునీటి ట్యాం కులో కోతులు పడి చనిపోయిన సంఘటనపై నల్ల గొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన తీవ్ర ఆగ్ర హం వ్యక్తం చేశారు . ఈ విషయంపై నందికొండ మున్సిపల్ కమిషనర్, నీటిపారుదలశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లకు ఆమె షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అంతేకాక స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టీ. పూర్ణచందర్ ను విచారణ అధికారిగా నియమించారు. సంఘటనపై తక్షణమే పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాలని ఆమె ఆదేశించారు. నల్గొండ జిల్లా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గురువారమే నందికొండ హిల్ కాలనీని సందర్శించి విచారణ చేపట్టి తన నివేదికను సమర్పించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విచారణ నివేదిక ప్రకారం నాగార్జునసాగర్ విజయ విహార్ హిల్ కాలనీలో కోతులు పడి చనిపోయిన వాటర్ ట్యాంక్ ద్వారా కేవలం 9 గృహాలకు మాత్రమే తాగునీరు సరఫరా అవుతున్నట్లు తన విచారణలో తేలిందని, ఈ ఇండ్లలో 49 మంది మాత్రమే ఉన్నారని వెల్లడించారు. మొత్తం హిల్ కాలనీలో 3 పెద్ద ట్యాంకులు ఉన్నాయని, 2 హిల్ కాలనీకి, మరొకటి పైలాన్ కాలనికి తాగునీరు అందిస్తున్నాయని, కోతులు పడి చనిపోయిన తాగునీటి ట్యాంకు ప్రత్యేకంగా ఉందని, ఇది కేవలం 9 ఇండ్లకు మాత్రమే తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తన విచారణలో తెలిసిందని పేర్కొన్నారు. సంఘటన జరిగిన వెంటనే నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు కోతులు పడి చనిపోయిన నీటి ట్యాంకు నుండి నీరు రావటం లేదని గుర్తించడం జరిగిందని, ఈ నెల 3 తేదీన మధ్యాహ్నం 2 గంటలకు ఈ విషయాన్ని గమనించడం జరిగిందని, తక్షణమే నీటి సరఫరా నిలిపివేయడమే కాకుండా, చనిపోయిన కోతులను తొలగించినట్లు వెల్లడించారు. అంతేకాక మిషన్ భగీరథ ప్రధాన ఇంట్రా పైపులైన్ తో ఉన్న లింకును కూడా తీసివేయడం జరిగిందని, ఈ సంఘటన వల్ల ఇప్పటివరకు ఎవరికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తలేదని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సైతం హిల్ కాలనీని సందర్శించి ప్రజల ఆరోగ్య పరిస్థితిపై సమీక్షించడం జరిగిందని, ఆరోగ్య శాఖ ద్వారా అవసరమైన మందులు కూడా సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. అలాగే 9 గృహాలకు సంబంధించిన ప్రజలకు తాగునీరు అందించేందుకు ప్రత్యామ్నాయ పైపులైను ఏర్పాటు చేయడం జరిగిందని తన విచారణ నివేదికలో పేర్కొన్నారు.



**ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు**

నల్లగొండ జి ల్లా, నాగార్జునసాగర్ నందికొండ మున్సిపాలిటీ, హిల్ కాలనీ విజయ విహార్ వద్ద నీళ్ల ట్యాంకులో మరణించిన కోతుల ఘటనకు బాధ్యులైన ఎన్ఎస్‌పి వాటర్ సప్లై ఎఇ బిక్షం, ఇద్దరు సిబ్బంది వెం కటేశ్వర్లు, నరసింహపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సంపత్ గౌడ్ తెలిపారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com